మానేరు **జనత**®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

7.07.2025 సోమవారం Monday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 81 | పేజీలు : 8 Pages : 8 | Published from : Karimnagar

## టీమిండియాదే రెండో టెస్టు



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# ద్వంద్వ విధానాలకు

# గ్లోబల్ సౌత్ బలి

## 21వ శతాబ్దపు అంతర్జాతీయ సంస్థల్లో పారదర్శకత తేవాలి



**ఈ సంస్థల్లో మూడింట**
**రెండువంతుల ప్రజలకు ప్రాతినిధ్యమే లేదు**
**అందుకే అవి నెట్ వర్క్ లేని మొబైల్ వంటివి**
**బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ పవర్ఫుల్ స్పీచ్**
**పహెల్గాం ఉగ్రదాడిని ఖండించిన బ్రిక్స్ నేతలు**

**జనతా న్యూస్, బ్రెజిల్ :** జమ్మూ కాశ్మీర్లోని సహర్లాంలో జరిగిన ఉగ్రవార దాడి భారతదేశానికే కాదు. మొత్తం మానవాళిపై జరిగిన దాడి అని ప్రధాని మోడీ బ్రిక్స్ సదస్సులో అభివర్ణించారు. మానవాళి ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సవాళ్లలో ఉగ్రవాదం ఒకటని నొక్కి చెప్పారు. బ్రెజిల్లో ఆదివారం జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో మోడీ ప్రసంగించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా బ్రిక్స్ దేశాలు స్పష్టమైన ఏకీకృత వైఖరిని అవలంభించాలన్నారు. ఏదైనా దేశం టెరిజానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చ పెంచారు. వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ఉగ్రవాదానికి మద్దతిచ్చే చర్యలను

మిగతా 2 లో

# సంయమనం పాటించండి

**మంత్రి కొండా సురేఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన**

ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య వివాదం పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డే నేరుగా రంగంలోకి దిగారు. ఆదివారం మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుష్మితాపటేల్‌లను తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు.



02



# 42కు చేరిన 'సిగాచి' మృతుల సంఖ్య

**ఆస్పత్రిలో కార్మికుడి మృతి**
**డీఎన్ఏ పరీక్షల ఆధారంగా ముగ్గురి వివరాల గుర్తింపు**
**ఆచూకీ తెలియని మరో మంది కోసం అన్వేషణ**
**సిగాచి పరిశ్రమకు తాళం**

**జనతా న్యూస్, పటాన్‌చెరు :** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 42కు పెరిగింది. పటాన్‌చెరులోని ధృవ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు జితేందర్ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రసూల్‌పూర్‌కు చెందిన జితేందర్ 80శాతానికి పైగా

మిగతా 2 లో



02

## ఇందిరమ్మ ఇళ్లు.. దేశానికే ఆదర్శం

ఏడాదిలోనే పథకానికి రూ.22 వేల కోట్ల ఖర్చు
వచ్చే మూడేళ్లలో మరెన్నో పథకాలు అందిస్తాం
పుట్టగతులుండవనే ప్రతిపక్షాల ఆందోళన కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయి : భట్టి విక్రమార్క

# రాష్ట్ర రైతాంగాన్ని నీళ్లిచ్చి ఆదుకోవాలి

## కన్నెపల్లి నుంచి నీళ్లివ్వండి మేడిగడ్డ పిల్లర్లు కుంగాయన్న సాకు వద్దు



03

లేదంటే కేసీఆర్ ఆధ్వర్యంలో నీటి మోటార్లను నడిపిస్తాం అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగానే ఉన్నాయని ఉత్తమ్ చెప్పారు నీళ్ల విలువ తెలియని పాలకుల వల్లే ఇబ్బందులు: హరీశ్ రావు

# కుంగే బ్యారేజీలకు నీళ్లు ఎత్తిపోయాలా?

**ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హరీశ్ యత్నం**

రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారా? రికార్డు స్థాయిలో వరి పంట సాగయింది ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలి: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



03



## కోరుట్ల చిన్నారిని చంపింది చిన్నమ్మేనా?

పోలీసుల అదుపులో అనుమానితురాలు ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే దారుణం

02

## బీఆర్ఎస్ నేతలకు కళ్లుమంట!



03

అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు మాటలా?
రైతుబంధు సొమ్మును ఎప్పుడైనా రెండు నెలల్లోపు వేశారా?
'బంధు' పేరుతో ఎగ్గొట్టిన పథకాలు ఎన్ని?
వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం



## ఐక్యతా స్ఫూర్తి.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ

ఆయన ఆశయాలకు అనుగుణంగానే ఆర్టికల్ 370 రద్దు
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

.. వివరాలు 3లో



## నేడు భారీ, రేపు అతి భారీ వర్షాలు

02

# సంయమనం పాటించండి

## మంత్రి కొండా సురేఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన



**హైదరాబాద్ , జూలై 6 :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య వివాదం పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డే నేరుగా రంగంలోకి దిగారు. ఆదివారం మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె సుష్మితాపటేల్‌లను తన నివాసానికి పిలిపించుకుని మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో బాధ్యత గల నాయకులు అయ్యుండి.. పార్టీ అంతర్గత వేదికలపై మాట్లాడాల్సిన అంశాలను బహిరంగంగా ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీకి బలమైన నాయకుల అవసరమేనని, అయితే ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు కూడా ముఖ్యమేనని సీఎం వెల్లడించినట్లు సమాచారం. ఈ వ్యవహారం ఇప్పటికే అధిష్ఠానం వరకు వెళ్లిందని, ఇక మీదట సంయమనం పాటించాలని సూచించినట్లు తెలిసింది. కాగా.. కొండా మురళి వ్యాఖ్యలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటు చేసుకున్న వివాదంపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ సోమవారం గాంధీభవన్‌లో భేటీ కావాల్సి ఉంది. అయితే ఆ సమావేశం వాయిదా పడినట్లు కమిటీ చైర్మన్ మల్లు రవి ప్రకటించారు. వరంగల్ కార్పొరేషన్ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు పాల్గొనాల్సి ఉన్నందున భేటీని ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు ఓ ప్రకటనలో ఆయన వెల్లడించారు.

**నేడు ఢిల్లీకి సీఎం రేవంత్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఉదయం 9 గంటలకు వ్యవసాయ యూనివర్సిటీ ఆవరణలో జరిగే వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సీఎం.. అనంతరం అక్కడి నుంచి నేరుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 10.30 గంటలకు విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. ఈ పర్యటనలో రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్రమంత్రులను ఆయన కలిసే అవకాశం ఉంది. అలాగే అధిష్ఠానం పెద్దలనూ కలిసే ఆస్కారముంది. ఇటు హైదరాబాద్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్‌ను సీఎం రేవంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో ఆయన్ను సత్కరించి, వెండి నంది జ్ఞాపికను బహూకరించారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. దళితుల అభ్యున్నతి, వారి హక్కుల కోసం జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని.. దేశానికి ఎనలేని సేవలందించారని ఈ సందర్భంగా కొనియాడారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**కొత్తగూడెం, జూలై 6 :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లను కేటాయించామని, బఫర్ కింద మరో 1,500 ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో నియోజకవర్గానికి చెందిన 2,500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను ఎన్నికల్లో ప్రచారానికి మాత్రమే వాడుకుని ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాగా, రాష్ట్రంలోని ఉట్నూరు, భద్రాచలం, మన్ననూర్, ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలోని 21 నియోజకవర్గాల్లో 13,266 చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని మంత్రి పొంగులేటి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం తొలి విడతలో భాగంగా అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూర్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి చెంచులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందించ నున్నట్టు ఆయన పేర్కొన్నారు.

# 42కు చేరిన 'సిగాచి' మృతుల సంఖ్య

మొదటి పేజీ తరువాయి

కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరాడు. మరోపక్క, మార్చురీలో గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న రెండు మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు చేసిన వైద్యులు.. మృతులను ఇస్నాపూర్‌కు చెందిన దాసరి రామాంజనేయులు (52), మధ్యప్రదేశ్‌కు చెందిన చికెన్‌సింగ్ (49)గా గుర్తించారు. ఆ మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. చికెన్‌సింగ్ కుటుంబానికి రూ.లక్ష అందజేసిన అధికారులు మృతదేహాన్ని అంబులెన్స్‌లో మధ్యప్రదేశ్‌కు తరలించారు. అలాగే, ప్రమాదం జరిగిన రోజు నుంచి ఆచూకీ లేకుండా పోయిన మహబూబాబాద్‌కు చెందిన ఎం.అఖిల్ అనే కార్మికుడి శరీర అవశేషాలను వైద్యులు డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించి వాటిని కుటుంబసభ్యులకు అప్పగించారు.

అఖిల్ కుటుంబం ఉప్పల్‌లోని కొర్రేముల్‌లో నివాసముంటోంది. మొత్తంగా 42 మంది కార్మికులకు చెందిన మృతదేహాలు, శరీర అవశేషాలను బాధిత కుటుంబాలకు అధికారికంగా అప్పగించారు. మరో 18 మంది క్షతగాత్రులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఘటన జరిగిన నాటి నుంచి ఆచూకీ లేకుండా పోయిన మరో 8 మంది కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఘటనాస్థలిలో లభించిన 70కి పైగా నమూనాలను ఇప్పటికే ల్యాబ్‌లకు తరలించగా.. ఇంకా ఏమైనా అవశేషాలు లభిస్తాయేమోనని అధికారులు ఘటనా స్థలిని జల్లెడ పడుతున్నారు. సిగాచి పరిశ్రమ ప్రధాన గేటుకి ఎట్టకేలకు తాళం పడింది. శిథిలాల తొలగింపు కార్యక్రమం దాదాపు పూర్తవ్వగా.. ఇప్పటివరకు తమ వారి ఆచూకీ లభించకపోవడంతో కొన్ని కుటుంబాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. వారంతా పాశమైలారం ఐలా భవనం వద్ద పడిగాపులు పడుతున్నారు.

# ద్వంద్వ విధానాలకు గ్లోబల్ సౌత్ బలి




మొదటి పేజీ తరువాయి

ఉపేక్షించొరని తెలిపారు. ఉగ్రవాదాన్ని ఇండించడం ఒక సూత్రంగా ఉండాలని, సౌలభ్యం కోసం కాదని నొక్కి చెప్పాడు.

**టైప్టర్లలో సాఫ్ట్వేర్షన్ అవుతుందా?**

20వ శతాబ్దంలో ఏర్పాటైన ప్రపంచ సంస్థలు 21వ శతాబ్దపు సవాళ్లను ఎదుర్కోలేక పోతున్నాయని ప్రధాని స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) యుగంలో, సాంకేతికత ప్రతి వారం అప్డేడేట్ అవుతుందని, కానీ ఒక అంతర్జాతీయ సంస్థలు 80 సంవత్సరా లకు ఒకసారి కూడా నవీకరించబడటం లేదని తెలిపారు. 20వ శతాబ్దపు టైప్టర్లు 21వ శతాబ్దపు సాఫ్ట్వేరు రన్ చేయలేవని, కాబట్టి గ్లోబల్ ఆర్గనైజేషన్స్ ప్రస్తుత సాంకేతిక పురోగతికి అనుగుణంగా ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మందికి అంతర్జాతీయ సంస్థల్లో సరైన ప్రాతినిధ్యం లేదన్నారు. నేడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన భాగస్వాములుగా మారుతున్న గ్లోబల్ సౌలకు వీటిలో సరైన ప్రాతినిధ్యం లేకపోవడం శోచనీయమ న్నారు ఇది మొబైల్ లో సిమ్ కార్డు తున్నా. నెట్వర్క్ లేక పోవడం వంటిదాని విమర్శించారు. వీటిలో పారదర్శకత లోపించిందని ఈ సంస్థల ద్వంద్వ ప్రమాణాలకు గ్లోబల్ సౌత్ బలైందని విరుచుకుపడ్డారు. అభివృద్ధి, భద్రతను నియంత్రించే అంతర్జాతీయ వ్యవస్థలలో గ్లోబల్ సౌత్ ప్రమేయం పరిమితంగానే ఉండిపోతున్నదని, అంతర్జాతీయ వ్యవహారాల్లో నిర్ణయాధికారంలో వీటికీ భాగముండాల్సిందేనని స్పష్టం చేశారు.

**పహల్గామ్ దాడిని ఖండించిన బ్రిక్స్**

పహల్గాం ఉగ్రదాడిని బ్రిక్స్ దేశాలు ఖండించాయి. ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ఉగ్రవాద చర్యలు నేరపూరితమైనవని, సమర్థించలేని వని తెలిపాయి. 2025 ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్ జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఉగ్రవాదం పట్ల జీ టాలరెన్స్ విధానాన్ని అనుసరించాలి. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలను తిరస్కరిం 'చాలి' అని పేర్కొంది.

బ్రిక్స్ సమావేశానికి రష్యా చైనా అధ్యక్షులు హాజరుకాలేదు. 12 ఏళ్లలో తొలిసారి చైనా అధ్యక్షుడు. టీ జిన్ పింగ్ బ్రిక్స్ సమావేశానికి గైర్హాజరయ్యారు. బిజీ షెడ్యూల్ వల్లే ఆయన రావట్లేదన్న చైనా, జిన్పెంగ్ బదులుగా లి కియాంగ్ను పంపింది. రష్యా. అధ్యక్షుడు పుతిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా. సదస్సులో పాల్గొన్నారు. వచ్చే ఏడాది జరిగే బ్రిక్స్ మీటింగ్కు భారత్ అతిథ్యం ఇవ్వనుంది. బ్రెజిల్లో నాలుగు రోజుల పర్యటన ముగించుకున్న ఆనంతరం ప్రధాని మోడీ.. అక్కడి నుంచి నమీబియా పయనమ వనున్నాడు.



# ఇందిరమ్మ ఇళ్లు.. దేశానికే ఆదర్శం

**ఏడాదిలోనే పథకానికి రూ.22 వేల కోట్ల ఖర్చు**

**వచ్చే మూడేళ్లలో మరెన్నో పథకాలు అందిస్తాం**

**పుట్టగతులుండవనే ప్రతిపక్షాల ఆందోళన**

**కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయి: భట్టి విక్రమార్క**

**మధిరటౌన్, జూలై 6 :** ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఒక్క ఏడాదిలోనే ఈ పథకానికి రూ. 22 వేల కోట్లు ఖర్చు చేసి 4.5 లక్షల మంది పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఖమ్మం జిల్లా మధిరలో ఆదివారం మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లు అధికారంలో ఉన్న వారు 'డబుల్‌బెడ్ రూం' పేరుతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా తాను, సహచర మంత్రులమంతా ధృడసంకల్పంతో పనిచేస్తున్నామని తెలిపారు. రానున్న మూడున్నరేళ్లలో మరిన్ని అద్భుతమైన పథకాలు తీసుకువస్తామని చెప్పారు. తాము రోజుకు 18 గంటలు కష్టపడి పనిచేస్తూ గత పాలకులు చేసిన అప్పులు చెల్లిస్తూనే సంక్షేమాన్ని, అభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో తమకు పుట్టగతులు ఉండవని ప్రతిపక్షాలు అందోళన చెంది కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా తాము ప్రజల కోసం నిటారుగా నిలబడతామని ఆయన పేర్కొన్నారు.

# కోరుట్ల చిన్నారిని చంపింది చిన్నమ్మేనా?

**పోలీసుల అదుపులో అనుమానితురాలు**

**ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే దారుణం**



**కోరుట్ల, జూలై 6 :** జగిత్యాల జిల్లా కోరుట్లలో చోటు చేసుకున్న ఐదేళ్ల బాలిక హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. బాలిక(బాబాయ్ భార్య) చిన్నమ్మ మమతపై అనుమానంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి హితీక్షను గొంతు కోసి చంపి పక్కింటి బాత్రూంలో పడేసిన ఘటన శనివారం కలకలం రేపింది. ఘటనా స్థలం దగ్గర జాగిలాలతో తనిఖీలు చేపట్టగా అవి హితీక్ష ఇంటిలోకి వెళ్లి నిలిచిపోవడంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేశశరు. ఇంట్లో ఉన్న వారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని పరిసరాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇంట్లోకి వచ్చిపోయే వారి వివరాలతో పాటు హితీక్ష చిన్నమ్మ మమత ఫోన్ డేటాను పరిశీలించారు. మమత సెల్‌ఫోన్‌లో హత్య చేయడానికి సంబంధించిన కొన్ని వీడియో క్లిప్పింగులను గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. హత్య జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా మమత సాయంత్రం 6:30 గంటల నుంచి మృతదేహం దొరికే వరకు ఐదుసార్లు అదే ప్రాంతానికి వచ్చిపోయినట్లు గుర్తించారు. తనను ఇంట్లో చిన్నచూపు చూస్తున్నారనే మమత తన తోడి కోడలు నవీనపై కక్ష పెంచుకొని ఆమె కూతురు హితీక్షను హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. మమత హత్య కోసం వాడిన పరికరాలతో పాటు ఆమె వేసుకున్న లెగ్గిన్‌ను పట్టణ శివారులోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద పోలీసులు సేకరించినట్లు తెలిసింది. కాగా, మమత ఆన్‌లైన్ గేమ్స్‌తో పాటు బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెట్టి రూ. 25లక్షలు పోగొట్టుకున్నట్టు తెలిసింది.

# నేడు భారీ, రేపు అతి భారీ వర్షాలు

**హైదరాబాద్, జూలై 6 :** రాష్ట్రంలో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం అక్కడక్కడ ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలు పడతాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక పెద్దపల్లి, భూపాలపల్లి, జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ నెల 12 వరకు రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

# మోదీ మెగా ఫెయిల్యూర్ మాటేంది?

## రామచందర్‌రావుకు మంత్రి పొన్నం ప్రశ్న

**హైదరాబాద్, జూలై 6 :** గడిచిన 11 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు అణా పైసా తేలేని బీజేపీ నేతలు.. తమకు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీఎం రేవంత్‌కు లేఖలు రాయడం కాదని, ముందు మోదీ సర్కారు మెగా ఫెయిల్యూర్ మాటేందో చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును ప్రశ్నించారు. వాగ్దానాలతో ఊదరగొట్టడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, అబద్ధాలను ఆవిష్కరించడం తప్ప మోదీ సర్కారు చేసిందేమీ లేదన్నారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన చరిత్ర మోదీ సర్కారుదని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. 60 ఏళ్లు దాటిన సన్న చిన్నకారు రైతులకు పింఛన్లు ఇస్తామన్నారని, కిసాన్ సమ్మాన్ నిధిని పెంచుతామన్నారని, వాటిని అమలు చేశారా? అని ఆయన ప్రశ్నించారు.

# ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

## ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి:ఎమ్మెల్సీ కవిత



**కవాడిగూడ :** ఏకలవ్య భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ మొదలుపెట్టిన ఏకలవ్య భవన నిర్మాణాన్ని పూర్తిచేయలేని పరిస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ఎరుకల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురంభీం విగ్రహం వద్ద ఏకలవ్య జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి కవిత హాజరై ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తరువాత నాటి సీఎం కేసీఆర్ ఎరుకల కులస్థుల అభివృద్ధి కోసం ఎంపవర్మెంట్ స్కీంను ప్రవేశపెట్టారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని తుంగలో తొక్కిందన్నారు. తాను శాసనమండలిలో ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చలనం లేదని విమర్శించారు. 50వేల ఎరుకుల కుటుంబాలకు రూ. 60కోట్ల మేర లబ్ధి చేకూర్చే పథకాన్ని మెరుగుపరిచి ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలన్నారు. రూ. 500 కోట్లతో ఎరుకుల కార్పొరేషన్‌నూ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు.

# కుంగే బ్యారేజీలకు నీళ్లు ఎత్తిపోయాలా?

## ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హరీశ్ యత్నం

## రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారా?

## రికార్డు స్థాయిలో వరి పంట సాగయింది

## ఇప్పటికైనా అబద్ధాలు మాట్లాడడం మానుకోవాలి: ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 6 :** "అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజీలు ప్రమాదకరంగా ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎసఏ) హెచ్చరించింది. అయినా సరే, కన్నెపల్లి పంప్‌హౌజ్ నుంచి నీటిని ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు పదే పదే మాట్లాడుతున్నారు. దీని వెనుక ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర తప్ప రైతులకు మేలు చేసే ఉద్దేశం లేదు. కుంగే బ్యారేజీలకు నీళ్లు ఎత్తిపోయాలా?" అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులు బాగుంటే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. గతంలో మేడిగడ్డ బ్యారేజీ నుంచి అన్నారం, సుందిళ్ల, అక్కణ్నుంచి ఎల్లంపల్లికి లిఫ్ట్ చేసిన 160 టీఎంసీలలో దాదాపు 57 టీఎంసీల నీళ్లు మళ్లీ గేట్లు ఎత్తి సముద్రానికి పంపించి ప్రజాధనాన్ని గోదాట్లో పోసిన విషయం మరిచిపోయారా..? అని ప్రశ్నించారు. సీకెంట్ ఫైల్స్ టెక్నాలజీతో మేడిగడ్డ నిర్మాణం చేపట్టిన విషయాన్ని ఎన్డీఎసఏ తప్పుబట్టిందని తెలిపారు. మేడిగడ్డ మాదిరిగానే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను అదే సీకెంట్ ఫైల్స్ ఫౌండేషన్ టెక్నాలజీతో నిర్మించటంతో ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. ఎన్డీఎసఏ సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టులపై తగిన నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. గోబెల్స్‌కు మించి ప్రచారం చేయటం హరీశ్ రావుకు అలవాటైపోయిందని, ఇప్పటికైనా అబద్ధాలు మా ట్లాడడం మానుకోవాలన్నారు. గత ఏడాది వానాకాలంతో పాటు ఇటీవలి యాసంగిలో దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా తెలంగాణ రైతులు రికార్డు స్థాయిలో వరి పంట సాగు చేశారని చెప్పారు. గత వానాకాలంలో 66.7 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేసి 153.5 లక్షల మెట్రి క్ టన్నుల ధాన్యం పండించారని, యాసంగిలో 60 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తే.. 130 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించిన ఘనత తెలంగాణ రైతులదని పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే ఒకే ఏడాదిలో 283 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సాధించిన రికార్డు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందన్నారు. ప్రతి ఏడాది జూలై చివరిలో లేదా ఆగస్టు ఒకటో తేదీన కల్వకుర్తి పంపులను ప్రారంభించి వానాకాలం పంటలకు నీళ్లు అందిస్తారని, ఈసారీ అదే విధానం అమలవుతుందని ఆయన వెల్లడించారు.

# 'హింస' డైలాగ్‌లను నేతలు సమర్థించడం విచారకరం

## నాయకులు ఎలా ఉన్నారో ప్రజలే గమనించాలి

## పుస్తక ఆవిష్కరణలో వెంకయ్య నాయుడు



**హైదరాబాద్ సిటీ, జూలై 6 :** హింసను ప్రోత్సహించే కొన్ని సినిమా డైలాగులను బాహాటంగానే కార్యకర్తలు చెబుతుండడం, కొందరు నాయకులు వారిని సమర్థిస్తుండడం విచారకరమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. నాయకులు ఎలా ఉన్నారో ప్రజలు గమనించాలని, ఎలాంటి వారి వెంట తిరుగుతున్నామో కార్యకర్తలు కూడా ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవుపలికారు. ఆదివారం హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో 'నిరుపమాన దేశభక్తులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి' పుస్తకాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమం కోసం తమ యావదాస్తిని, జీవితాలను అంకితం చేసిన పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతులు మహనీయులని కొనియాడారు.

ఆ దంపతుల జీవితం ఆదర్శనీయమని.. వారి జీవితాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత రాజకీయాలు సాగుతున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. నాయకత్వమంటే అధికారం, అజమాయిషీ చలాయించడం కాదని.. బాధ్యతతో వ్యవహరించడమని చెప్పారు. నాయకుడికి క్యారెక్టర్ (గుణం), కెపాసిటీ (సామర్థ్యం), క్యాలిబర్ (యోగ్యత), కాండక్ట్ (నడత) అనే నాలుగు 'సీ'లతో కూడిన ఉత్తమ లక్షణాలు ఉండాలని హితవు పలికారు. క్యాష్ (డబ్బు), కమ్యూనిటీ (వర్గం), క్యాస్ట్ (కులం), క్రిమినాలిటి (నేరచరిత్ర) అనే నాలుగు 'సీ'లను కలిగిన వారితో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పుస్తక రచయితలు గాదం గోపాలస్వామి, తిప్పిరిశెట్టి వెంకట రంగనాయకులుతో పాటు పసలకృష్ణమూర్తి మనుమరాలు వీణ, ఏపీ ఎమ్మెల్సీ మండలి బుద్ధప్రసాద్, ఐఏఎస్ రాజమౌళి పాల్గొన్నారు.

# రాష్ట్ర రైతాంగానికి నీళ్లిచ్చి ఆదుకోవాలి

## కన్నెపల్లి నుంచి నీళ్లివ్వండి మేడిగడ్డ పిల్లర్లు కుంగాయన్న సాకు వద్దు

## లేదంటే కేసీఆర్ ఆధ్వర్యంలో నీటి మోటార్లను నడిపిస్తాం

## అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగానే ఉన్నాయని ఉత్తమ్ చెప్పారు

## నీళ్ల విలువ తెలియని పాలకుల వల్లే ఇబ్బందులు: హరీశ్ రావు



**హైదరాబాద్, జూలై 6 :** "మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లు కుంగినాయన్న సాకుతో కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని పడావు పెట్టారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు తీసుకునే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఇంజనీర్లే చెప్తున్నారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని మోటర్లు ఆన్ చేయకుండా రైతులను గోస పెడుతోంది. ఇప్పటికైనా స్పందించి తక్షణమే కన్నెపల్లి, కల్వకుర్తి పంపులను ఆన్ చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలి. లేకపోతే కేసీఆర్ నాయకత్వంలో లక్షలాది మంది రైతులందరం కలిసి మోటర్లు ఆన్ చేస్తాం" మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 36 రోజుల క్రితమే శ్రీశైలానికి వరద మొదలవ్వగా.. ఇప్పటికీ కల్వకుర్తి మోటార్లను నడపడం లేదని మండిపడ్డారు. కళ్లముందు నీళ్లు పోతుంటే పట్టించుకోని ప్రభుత్వం తీరు నేరపూరితంగా ఉందన్నారు. పదే పదే తాను పాలమూరు బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి, అక్కడి రైతుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. గత ఏడాది ఆ ప్రాంత రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించి ఆంధ్రలో మూడో పంటకు నీళ్లు వదిలారని, ఈసారీ ఆంధ్రకు నీళ్లొదిలే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణా జల్లాలో అతి తక్కువ నీళ్లు వాడుతున్నది రేవంత్ రెడ్డి ప్రభుత్వమేనని, చంద్రబాబుతో రేవంత్‌కు ఉన్న చీకటి ఒప్పందం ఏంటో చె ప్పాలని డిమాండ్ చేశారు. నీళ్ల విలువ తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉంటే ఆ నీళ్లను మలుపుకొనే ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటారని చెప్పారు. కానీ నీళ్ల విలువ తెలియని నాయకులు మన పాలకులుగా ఉండటం వల్ల రైతాంగం తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని దుయ్యబట్టారు. గతంలో కోదండరాం అడిగిన ప్రశ్నకు, అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ సమాధానమిస్తూ.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు బాగానే ఉన్నాయని చెప్పారని గుర్తుచేశారు. మరి ఆ బ్యారేజీల్లోకి నీరు ఎత్తిపోసి రైతులకు అందించడానికి ప్రభుత్వానికున్న ఇబ్బందులేంటని ప్రశ్నించారు. రోజు కు రెండు టీఎంసీల నీళ్లను కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి తెచ్చుకునే అవకాశం ఉందని, ఈరోజు కాళేశ్వ రం మోటర్లు ప్రారంభించినా.. 15జిల్లాలకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు బీఆర్ఎసపై బురద జల్లడంలోనే పోటీపడుతున్నారని, రైతులకు సాగునీటిని అందించాలన్న అంశంపై దృష్టి పెట్టడం లేదని ఆయన విమర్శించారు.

# బీఆర్ఎస్ నేతలకు కళ్లుమంట!

## అధికారంలో ఉన్నప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు మాటలా?

## రైతుబంధు సొమ్మును ఎప్పుడైనా రెండు నెలల్లోపు వేశారా?

## 'బంధు' పేరుతో ఎగ్గొట్టిన పథకాలు ఎన్ని?

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం



**హైదరాబాద్, జూలై 6 :** రైతుల్లో ఆనందం, సంతోషం వెల్లివిరు-స్తుంటే బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక పోతున్నారని, వారి కళ్లు మండుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తోంటే బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు రైతు సమస్యలపై చర్చించాలని అంటుంటే.. మొగుణ్ణి కొట్టి మొగసాలకు ఎక్కినట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలపై మంత్రి తుమ్మల ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిన్నరలో లక్షా మూడు వేల కోట్ల రూపాయలను రైతు సంక్షేమానికి ఖర్చు చేసి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. రాష్ట్రంలో తాము అధికారం చేపట్టిన తర్వాత రైతులకు దిగుబడులు పెరిగాయని, అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు అందుతున్నాయని చెప్పారు.

అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు వ్యవసాయం, రైతులు, ఎరువులు,నీళ్లు అని మాట్లాడుతుంటే.. వారంతా నిస్పృహలో ఉన్నారనే విషయం తెలంగాణ సమాజం అర్థం చేసుకుందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్రప్రభుత్వం ఒకేసారి రూ.21వేల కోట్లు రుణమాఫీ చేసి 25 లక్షల మంది రైతులను రుణ విముక్తులను చేసిందని తుమ్మల తెలిపారు. బీఆర్ఎస్ ఎగ్గొట్టిన రైతుబంధుతోపాటు రెండో పంట కాలాల్లో రూ.13,500 కోట్లు రైతు భరోసా పథకం లో చెల్లించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభు త్వం 9 రోజుల్లో రూ.9000 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసిందన్నారు. దీంతో తమ రాజకీయ జీవితానికి ఎక్కడ చరమగీతం పడుతుందోనన్న భయంతో బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. "మీరు అరకొరగా చేసిన రుణమాఫీతో రైతులకు ఏమైనా లాభం కలిగిందా? అసలు రుణమాఫీ అయ్యిందా? రైతుబంధు సొమ్మును ఎప్పుడైనా రెండు నెలల్లోపు వేశారా? రైతుబంధు పేరుతో ఎగ్గొట్టిన పథకాలు ఎన్ని? ఐదేండ్లలో పంట నష్టపరిహారం ఎప్పుడైనా చెల్లించారా? కేంద్ర ప్రభుత్వ పథకాలకు వాటా ధనం చెల్లించకుండా నిధులు అడ్డుకున్నది ఎవరు? యాంత్రీకరణ పథకానికి తూట్లు పొడిచింది ఎవరు? మైక్రో ఇరిగేషన్ పథకానికి చరమగీతం పాడింది ఎవరు? ఏదైనా పంటలకు గిట్టుబాటు ధర కల్పించారా ? వరి వేస్తే ఉరి వేసుకున్నట్లే అన్నది ఎవరు? చివరికి పచ్చి రొట్ట విత్తనాల సబ్సిడీ కూడా బకాయిలు పెట్టింది ఎవరు?" అని బీఆర్ఎస్ నేతలను తుమ్మల ప్రశ్నించారు.

### 1.9లక్షల టన్నుల ఎరువుల లోటు

రాష్ట్రంలో 1.9లక్షల టన్నుల ఎరువుల లోటు ఉంద ని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతులు వానాకాలంలో 53 లక్షల బస్తాల యూరియా, 20లక్షల డీఏపీ, 45 లక్షల బస్తాల కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేశారని తెలిపారు. మరో 67లక్షల బస్తాల యూరియా, 8లక్షల బస్తాల డీఏపీ, 66లక్షల బస్తాల కాంప్లెక్స్ ఎరువులు, 6లక్షల ఎంఓపీ బస్తాలు, 4లక్షల ఎస్ఎస్పీ బస్తాలు జిల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఇదికాక, ప్రతిరోజు 2-3లక్షల బస్తాల ఎరువులు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.



# ఐక్యతా స్ఫూర్తి.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ

## ఆయన ఆశయాలకు అనుగుణంగానే ఆర్టికల్ 370 రద్దు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 6 :** దేశంలో ఇద్దరు ప్రధాన మంత్రులు, రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండకూడదని పోరాడిన నేతగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ చరిత్రలో నిలిచిపోతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే ప్రధాని మోదీ ఆర్టికల్ 370ని రద్దు చేశారని తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. ఒకే దేశం-ఒకే చట్టం-ఒకే రేషన్-ఒకే ఎన్నికలు అన్న భావనను విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. దేశ సమగ్రత కోసం ప్రతీ కార్యకర్తా శ్రమించాలని కోరారు.

శ్యామా ప్రసాద్.. పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిదాత అని అన్నారు. చిన్న వయసులోనే అనేక పోరాటాలు చేసి కశ్మీర్ సమస్యపై దీటుగా పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. కాగా, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఏటా ఐటీ ఉద్యోగులు బోనాల ఉత్సవాలను జరుపుకోవడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టీటా) ఆధ్వర్యంలో మాదాపూర్ ఐటీ కారిడార్‌లో చిన్న పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.

### బ్రాహ్మిణ్ ఎక్సెలెన్స్ సత్కారం

సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సెలెన్స్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద ర్‌రావును సన్మానించారు. బేగంపేటలోని పుష్పగిరి పీఠాధిపతి విద్యా శంకరభారతి స్వామి.. రాంచందర్‌రావును ఆశీర్వదించారు. అనంతరం సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సెలెన్స్ ప్రతినిధులు కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ వాణీదేవి, అరవిందరావు, జ్వాలా నరసింహారావు, వేణుగోపాలచారి, మాధవీలత, రాజీవ్‌శర్మ, రామచందర్‌రావు తదితరులు సన్మానించారు.

# నిండుకుండలా శ్రీశైలం



## 1.86 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. రేపు తెరుచుకోనున్న ప్రాజెక్టు గేట్లు

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. నేడు భారీ, రేపు అతిభారీ వర్షాలు

**కర్నూలు, జూలై 6:** ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి వరద పోటెత్తుతుండటంతో జూరాల ప్రాజెక్టు నిండు కుండలా కనిపిస్తుండగా.. శ్రీశైలం రిజర్వాయర్ కళకళలాడుతోంది. ఎగువన నారాయణపూర్ నుంచి జూరాలకు 99,933 క్యూసెక్కుల వరద విడుదలవుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 317.440 మీటర్లు కాగా, 7.535 టీఎంసీలు ఉన్నాయి. జూరాలకు ఆదివారం 1.13 లక్షల క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో నమోదు కాగా, డ్యామ్ 12 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 79,920 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రాలకు 29,296 క్యూసెక్కులు, వివిధ కాలువలు, లిఫ్ట్ కెనాల్‌లకు 3,455 క్యూసెక్కులతోపాటు దిగువకు 1,11,804 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో 204.728 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌లో 172.66 టీఎంసీల నీరు ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తుండటంతో మంగళవారం సాయంత్రం శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను ఎత్తడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు 1,86,212 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మరోవైపు,పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ కాలువలకు 10 వేల క్యూసెక్కులు, ప్రాజెక్టు పరిధిలోని జంట విద్యుత్ కేంద్రాల్లో జల విద్యుత్ తయారీకి 67,740 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నా రు. మరోవైపు, ఎగువ నుంచి తుంగభద్ర ప్రాజెక్టుకు 52,308 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, జలాశయంలో నీటి నిల్వ 77.34 టీఎంసీలకు చేరింది.

### ఆల్మట్టి నుంచి లక్ష క్యూసెక్కుల ఔట్ ఫ్లో

ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 91.08 టీఎంసీలు కాగా, రిజర్వాయర్‌కు 1,02,140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దిగువకు 1,06,070 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ జలాశయంలో 30.85 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ప్రాజెక్టుకు 99,933 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదయ్యింది.



# గ్రీన్ టీ తాగుతున్నారా?

## సరైన సమయం ఏదో తెలుసుకోండి.

గ్రీన్ టీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా పరిగణిస్తారు. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఈ పానీయం బరువు తగ్గడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. అందుకనే చాలామంది ఉదయం నిద్రలేచాక గ్రీన్ టీతోనే రోజును ప్రారంభిస్తారు. కానీ, ఖాళీ కడుపుతో ఈ టీ తాగడం వల్ల ఆరోగ్యపరంగా కలిగే ప్రయోజనాలేంటి? గ్రీన్ టీ ఏ సమయంలో తాగాలి? ఎప్పుడు తాగకూడదో అనే సందేహాలకు నిపుణులు ఏమని సమాధానమిస్తున్నారో తెలుసుకుందాం.

**ఖాళీ కడుపుతో గ్రీన్ టీ తాగవచ్చా?**

గ్రీన్ టీలో టానిన్లు, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి ఖాళీ కడుపుతో తీసుకుంటే కడుపులో ఆమ్ల ఉత్పత్తిని పెంచుతాయి. ఎసిడిటీ, గుండెల్లో మంట, అజీర్ణం లేదా వికారం వంటి సమస్యలను కలిగిస్తాయి. ఈ పద్ధతి అనుసరించే వారిలో కడుపు సహజ జీర్ణక్రియ దెబ్బతింటుంది. అంతేగాక, పోషకాహారం తీసుకున్నప్పటికీ శరీరం ఇనుమును గ్రహించలేదు. గ్రీన్ టీలో ఉండే కాటెచిన్లే ఇందుకు ప్రధాన కారణం.

**సరైన సమయం ఏది?**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, గ్రీన్ టీ తాగడానికి ఉత్తమ సమయాలు రెండే. భోజనం లేదా తేలికపాటి అల్పాహారం తర్వాత మాత్రమే ఈ పానీయం తీసుకోవాలి. ఉదయం బ్రేక్ ఫాస్ట్ తర్వాత గ్రీన్ టీ తాగడం అత్యుత్తమమని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల శరీరానికి అవసరమైన యాంటీఆక్సిడెంట్లను అందుతాయి. శక్తి స్థాయిలను పెరుగుతాయి. భోజనం తర్వాత గ్రీన్ టీ తాగినా జీర్ణవ్యవస్థకు ప్రయోజనకరమే.

గ్రీన్ టీ జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. కడుపు సమస్యల త్వరగా నివారించి ఉపశమనం పొందేందుకు సహాయపడుతుంది. సాయంత్రం వేళల్లో శరీరంలో శక్తి తక్కువగా ఉన్నట్లు అనిపిస్తే గ్రీన్ టీ తాగితే తక్షణమే ఎనర్జిటిక్ గా మారతాయి. ఇది శరీరంలో సహజ శక్తిని పెంపొందిస్తుంది. కొంతమంది వ్యాయామానికి ముందు లేదా తర్వాత గ్రీన్ టీ తాగడానికి ఇష్టపడతారు. ఎందుకంటే ఇది పనితీరు స్థాయిలను మెరుగుపరచడానికి, శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.

**రోజుకు ఎన్ని కప్పులు తాగాలి?**

సాధారణంగా రోజుకు 2 నుండి 3 కప్పుల గ్రీన్ టీ తాగితే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా గ్రీన్ టీ తాగడం వల్ల కడుపు నొప్పి, నిద్రలేమి, కాలేయంపై ఒత్తిడి వంటి పలు సమస్యలు వస్తాయి.

# ఇవి తింటే బ్లడ్ షుగర్ లెవల్స్ అమాంతం పెరిగిపోతాయి..



రక్తంలో అధిక మోతాదులో చక్కెర స్థాయిలు పెంచే ఆహారాలు తినడం ఆరోగ్యానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదు. శరీరంలో గ్లూకోజ్ పెరిగిందనేందుకు ఇది సంకేతం. డయాబెటిస్ ఉన్నవారు ఇంకా జాగ్రత్తంగా ఉండాలి. వీరి శరీరం అవసరమైన ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేదు లేదా శరీరం ఉత్పత్తి చేసిన ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోలేదు. ఎందుకంటే సాధారణంగానే వారి రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రణలో జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే అది మీ మొత్తం ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది గుండె జబ్బులు, మూత్రపిండాల వ్యాధి, రెటినోపతి, న్యూరోపతి వంటి వాటికి దారితీస్తుంది.

మీ రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం చూపే ప్రధాన అంశం మీరు తీసుకునే ఆహారం. మీ రక్తంలో చక్కెరను పెంచే ఆహారాన్ని మీరు తినకూడదు. అయితే, కొన్నిసార్లు తెలియకుండానే ఈ ఆహారాలను తినేస్తుంటారు. అవేంటో చూద్దాం.

**గ్రానోలా బార్లు**

వీటిని ఆరోగ్యకరమైన ఆహారాలుగా మార్కెటింగ్ చేస్తుంటాయి ఉత్పత్తిచేసే కంపెనీలు. కానీ, గ్రానోలా బార్‌లలో శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, సిరప్‌లు, ఎండిన పండ్లు ఉంటాయి. ఈ పదార్థాల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ అధికం. ఇవి మీ రక్తంలో చక్కెరను త్వరగా పెంచేస్తాయి.

**పెరుగు**

సాదా పెరుగు ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ ఫ్లేవర్డ్ రకాల్లో సాధారణంగా చక్కెరలు జోడిస్తారు. కొన్నిసార్లు ప్రతి సర్వింగ్‌కు 20 గ్రాముల వరకే తీసుకోవాలి. ఈ హిడ్డెన్ షుగర్స్ మీ రక్తంలో గ్లూకోజ్‌ను వేగంగా పెంచుతాయి. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తీసుకున్నప్పుడు.

**పండ్ల రసాలు**

సహజ పండ్ల రసంలో 100% ఫైబర్ ఉండదు. కానీ అన్ని పండ్లరసాల్లో ఇది కనిపిస్తుంది. అందువల్ల బ్లడ్ షుగర్స్ శరీరంలో అమాంతం పెరిగిపోతాయి. ఉదాహరణకు నారింజ రసం తాగిన వెంటనే రక్తంలో చక్కెర వేగంగా పెరిగిపోతుంది.

**చపాతీ**

మైదా పిండితో చేసిన రోటీ కంటే మంచిదే అయినప్పటికీ హెూల్ వీట్ బ్రెడ్ బ్రాండ్ ప్రాసెసింగ్‌ను బట్టి అధిక గ్లైసెమిక్ లోడ్‌ను కలిగి ఉంటుంది. కొన్ని హెూల్ వీట్ బ్రెడ్‌లలో చక్కెరలు కూడా ఉంటాయి లేదా ఇతర రకాల పిండితో తయారు చేస్తారు. ఇవి గ్లూకోజ్ స్థాయిలను పెంచుతాయి.

**ఓట్ మీల్స్**

ఓట్స్ ఆరోగ్యకరమైనవే అయినప్పటికీ ఇన్‌స్టంట్ ఓట్ మీల్ బాగా ప్రాసెస్ చేస్తారు. ఇందులో చక్కెర, ఉప్పు, ఇతర టేస్టీ ఇంగ్రిడియెంట్స్ ఉంటాయి. ఇందులో ఫైబర్ కంటెంట్ తక్కువ ఉండటం వల్ల త్వరగా జీర్ణమవుతుంది. కానీ, రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి.

**డ్రై ఫ్రూట్స్**

ఎండుద్రాక్ష, ఖర్జూరం లేదా ఆప్రికాట్ వంటి ఎండిన పండ్లు సహజ చక్కెర వనరులు. తాజా పండ్లలో నీటి శాతం ఉండదు. కానీ వీటిలో అధికం.

**కాఫీ (యాడ్-ఆన్‌లతో)**

కాఫీ రక్తంలో చక్కెర స్థాయిలను పెంచకపోయినా ఫ్లేవర్డ్ లాట్స్, ఐస్డ్ కాఫీలు, ఫ్రాప్స్ లలో సిరప్ లు, విప్డ్ క్రీమ్, చక్కెర పాలు ఉండవచ్చు. ఈ అదనపు పదార్థాలు మీ కాఫీని చక్కెరలతో నింపేస్తాయి.



# చియా గింజలు తినేవారికి గ్యాస్ట్రోఎంటిరాలజిస్టు హెచ్చరిక ఇది

స్మూతీస్ నుంచి పుడింగ్స్ వరకూ అనేక ఫుడ్స్‌లో చియా గింజలను జోడించడం తప్పనిసరి. ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ పెట్టేవారు ఈ మధ్య కాలంలో చియా గింజల వైపు మళ్లుతున్నారు. అయితే, వీటి విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోకపోతే అనారోగ్యం పాలై ఆసుపత్రిలో చేరాల్సి వస్తుందని డా. సౌరభ్ సేఠీ అనే గ్యాస్ట్రోఎంటిరాలజిస్టు ఇన్‌స్టాలో ఓ పోస్టు పెట్టారు. చియా గింజలను నానబెట్టకుండా తింటే రిస్క్‌లో పడినట్టేనని హెచ్చరించారు

చియా గింజలను ముందుగా నీళ్లల్లో నానబెట్టకుండా తింటే అవి జీర్ణవ్యవస్థలోకి ప్రవేశించాక నీరు పీల్చుకుని పెద్దగా అవుతాయి. అన్నవాహికకు అడ్డంపడి సమస్యలు తెచ్చిపెడతాయి. చియా గింజలు తమ బరువుకు అనేక రెట్లు ఎక్కువగా నీరు పీల్చుకుని పెద్దవిగా మారతాయి. కాబట్టి, ముందుగా నానబెట్టకుండా పచ్చి వాటిని నేరుగా తింటే అవి గొంతు, పొట్టలో ఇరుక్కుని ఇబ్బంది పెడతాయి. కడుపుబ్బరంతో పాటు జీర్ణవ్యవస్థకు సంబంధించిన తీవ్ర సమస్యలకు దారి తీస్తాయి.

'నీళ్లల్లో ముందుగా చియా గింజలను నాన బెట్టకుండా తిన్న వారు ఆసుపత్రి పాలైన ఘటనలు ఉన్నాయి. పచ్చి చియాగింజలు గొంతులో నీరు పీల్చుకుని పెద్దవిగా మారి యూసోఫేగస్‌కు అడ్డంపడిన ఘటనలు ఉన్నాయి. వీటిని ఎండోస్కోపీ ద్వారా తొలగించాల్సి ఉంటుంది. ఇది అరుదుగా మాత్రమే జరిగే ఘటనే అయినప్పటికీ ఆహారం తీసుకోవడంలో ఇబ్బందిపడే వారు. ఇతర జీర్ణవ్యవస్థ సంబంధిత సమస్యలు ఉన్న వారు అప్రమత్తంగా ఉండాలి' అని ఆ డాక్టర్ తెలిపారు. తమ బరువుకు 27 రెట్లతో సమానమైన నీటిని పీల్చుకునే శక్తి చియా గింజలకు ఉందని ఆయన అన్నారు.

కాబట్టి, వీటిని ముందుగా నీటిలో నానబెట్టి తినకపోతే రిస్క్ తప్పదని హెచ్చరించారు. 'తినడానికి ముందు కనీసం 30 నిమిషాల పాటు వీటిని నీటిలో నానబెట్టాలి. అప్పుడు అవి జెల్లీలా మారతాయి. తినడానికి సులువుగా ఉండటంతో పాటు ఈజీగా జీర్ణమవుతాయి. కొత్తగా చియా గింజలు తినేవారు తొలుత రోజుకు ఒక టీస్పూను గింజల చొప్పున తినడం మొదలెట్టాలి. శరీరం అలవాటు పడ్డ తరువాత ఎక్కువ మొత్తంలో వీటిని తినొచ్చు' అని తెలిపారు. నానబెట్టిన చియాగింజలు తింటే వాటిల్లోని ఒమెగా-3-ఫ్యాటీ యాసిడ్స్‌ను శరీరం పూర్తిగా గ్రహించగలుగుతుందని అన్నారు.

# పరగడుపున మెడిసిన్స్ వేసుకుంటున్నారా?

## ఇలా అస్సలు చేయొద్దంటున్న వైద్యులు

కొందరు ఔషధాల విషయంలో నిక్కచ్చిగా ఉంటారు. ఆరు నూరైనా సరే టైమ్‌కు మందులు వేసుకుంటారు. ఇది మంచి పద్ధతే. అయితే, కొందరు మాత్రం ఖాళీ కడుపుతో ఉన్నా సరే మందులు వేసుకుంటారు. ఏం కాదులే అని అనుకుంటారు. అయితే, ఇలాంటి నిర్లక్ష్యం అస్సలు పనికిరాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అసలు పరగడుపున ఔషధాలు ఎందుకు వేసుకోకూడదో వైద్యులు సవివరమైన సమాధానమే ఇస్తున్నారు. ఖాళీ కడుపుతో మందులు వేసుకుంటే బీపీ తగ్గడం, తలతిరిగినట్టు ఉండటం, స్పృహ తప్పడం, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ముప్పు ఉంది. ముఖ్యంగా బీపీ, హృద్రోగానికి సంబంధించి మందుల విషయంలో ఈ ప్రమాదం ఎక్కువ. ఎన్ఎస్ఏఐడీలు, లేదా స్టెరాయిడ్స్ కడుపులోపలి పొరపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. దీంతో, పరగడుపున మందులు వేసుకుంటే గ్యాస్ట్రైటిస్, అల్సర్ ముప్పు పెరుగుతుంది.

పరగడుపున మందులు వేసుకున్నప్పుడు అవి త్వరగా రక్తంలో కలిసిపోతాయి. దీంతో, ఒక్కసారిగా మనం ఊహించని సైడ్ ఎఫెక్ట్స్ మొదలవుతాయి. బీపీ, గుండె కొట్టుకునే వేగం, బ్లడ్ షుగర్ లెవెల్స్ వంటి వాటిల్లో తీవ్ర ఒడిదుడుకులు కనిపిస్తాయి. ఇక వార్ధక్య ఛాయలను తగ్గించే గ్లూటాథయోన్ వంటి ఔషధాలు, విటమిన్ సీ ఇంజెక్షన్లు వంటివి పరగడుపున తీసుకుంటే ఒక్కసారిగా బీపీ పడిపోతుందని వైద్యులు చెబుతున్నారు. ఇది చివరకు గుండె పోటుకు కూడా దారి తీస్తుందని అంటున్నారు. ఇక ఖాళీ కడుపున పది రకాల ఔషధాలు తీసుకుంటే ముప్పు మరింత పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

వైద్యులు చెప్పే దాని ప్రకారం, ఔషధాలను శరీరం వేగంగా గ్రహించి ఇబ్బంది పడకుండా కడుపులోని ఆహారం అడ్డుపడుతుంది. అయితే, పరగడుపున తీసుకునే మందులు కూడా కొన్ని ఉన్నాయి. లీవోథైరాక్సిన్, బైఫాస్ఫోనేట్స్, డాక్సీసైక్లిన్ లాంటి యాంటీబయాటిక్‌లను పరగడుపున వేసుకుంటే శరీరం వాటిని సమర్థవంతంగా గ్రహిస్తుంది. ఆహారం తీసుకున్నాక ఈ ఔషధాలు వేసుకుంటే ప్రభావం కొంత తగ్గుతుంది. కాబట్టి, మందుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వైద్యుల సలహాలు పాటించాలి.





# ఈ చిన్ని విత్తనాలతో కొలెస్ట్రాల్ మంచులా కరిగిపోతుంది..!

మనం ఆరోగ్యం గురించి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. మంచి ఆహారమే రోజూ తింటున్నా.. శరీరంలో అనవసర కొవ్వులు పెరిగిపోతూనే ఉంటాయి. నేటికాలంలో గుండె సంబంధిత సమస్యలు వేగంగా పెరుగుతున్నాయంటే.. అందుకు ప్రధాన కారణం కొలెస్ట్రాల్. మన జీవనశైలి నుంచి తీసుకునే ఆహారపానీయాల వరకూ అనేక అంశాలు చెడు కొలెస్ట్రాల్ పెరుగుదలకు దోహదం చేస్తాయి. ఫలితంగా, శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. ఇది ఇతర అనారోగ్య సమస్యలకు దారితీస్తుంది . వీటన్నింటిని ఎదుర్కోవాలంటే మన ఆరోగ్యాన్ని సరిగ్గా కాపాడుకోవాలి. ముఖ్యంగా రోజువారీ ఆహారంలో కొన్ని పదార్థాలను చేర్చుకోవాలి. పోషకాహార నిపుణుల ప్రకారం కొలెస్ట్రాల్‌ను కరిగించడంలో ఒకే ఒక పండు అద్భుతంగా సహాయపడుతుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా మనం ఆరోగ్యంగా ఉండవచ్చు.

దానిమ్మ కొలెస్ట్రాల్ అదుపు చేసే అద్భుతమైన పండు. దీని గింజలు క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరంలో కొవ్వులు అత్యంత వేగంగా కరిగిపోతాయని నిపుణులు అంటున్నారు. మీకు ఇప్పటికే అధిక బరువు సమస్య ఉంటే దానిమ్మపండ్లు తినడం వల్ల ధమనులలోని చెడు కొలెస్ట్రాల్ పూర్తిగా కరిగిపోతుంది. కాబట్టి, దానిని తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకోండి

**దానిమ్మ ఉపయోగాలు..**

ఎర్ర దానిమ్మపండ్లలో పాలీఫెనాల్స్, ఎలాజిక్ యాసిడ్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ అంటే %ాణు% ఆక్సీకరణను నిరోధిస్తాయి. వాస్తవానికి, ఆక్సీకరణ క్రమంగా ధమనులలో పేరుకుపోయి ప్లేక్‌గా మారుతుంది. ఇది ధమనుల ముడుచుకుపోవడానికి దారితీస్తుంది. ఈ కారణంగా గుండెపోటు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయి. దానిమ్మపండు తింటే ధమనులు శుభ్రపడతాయి. అనేక పరిశోధన నివేదికలు కూడా ఇదే రుజువు చేశాయి. దీని క్రమం తప్పకుండా దానిమ్మ పండు గింజలు తీసుకోవడం వల్ల గుండె జబ్బు ముప్పును ఆపవచ్చు. ఎందుకంటే, ఈ చిన్ని విత్తనాలు గుండెపై ఒత్తిడిని తగ్గించి.. కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తాయి.

**పేగు ఆరోగ్యానికి మేలు**

దానిమ్మ గింజల్లో దానిమ్మ రసం కంటే ఎక్కువ ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. ఫలితంగా తిన్న తర్వాత అజీర్ణం, మలబద్ధకం, ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు రావు. కాబట్టి దీన్ని రోజువారీ ఆహారంలో క్రమం తప్పకుండా తీసుకోవడం మంచిది. ఇది జీర్ణక్రియ, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అంతే కాదు, చెడు కొలెస్ట్రాల్‌ను కరిగించడంలో సహాయపడుతుంది.

ఈ పండ్లను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మన శరీరానికి యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు లభిస్తాయి. అంతేకాకుండా, వీటిలోని సహజ తీపి మనకు తక్షణ శక్తిని ఇస్తుంది. మనం అలసిపోయినప్పుడు ఈ పండ్లను తినడం వల్ల వెంటనే ఉత్తేజితమవుతాం. ఉదయాన్నే దానిమ్మ పండ్లను తినడం వల్ల డయాబెటిస్, ఉబ్బసం వంటి అనేక సమస్యలను నివారించవచ్చు. ఎముకలకు కూడా మంచిదని పోషకాహార నిపుణులు అంటున్నారు.

# టీమిండియాదే రెండో టెస్టు

## 336 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు
## రెండో ఇన్నింగ్స్‌లో 271 ఆలౌట్
## ఆరు వికెట్లతో ఆకాశ్‌దీప్ విజృంభణ
## ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌కు తొలి గెలుపు

**దిగ్గజ క్రికెటర్లు జట్టుకు దూరమయ్యారు.. గెలవాల్సిన తొలి టెస్టును అనుభవలేమితో కోల్పోయారు.. ఇక రెండో టెస్టులో స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి ఏం సాధిస్తారంటూ విమర్శలు.. అయినా అందరి సందేహాలను పటాపంచలు చేస్తూ యువ భారత్ ఎడ్జ్‌బాస్టన్‌లో సగర్వంగా నిలిచింది. దాదాపు ఆరు దశాబ్దాల నుంచి భారత్ ఈ వేదికపై దండయాత్ర చేస్తున్నా గెలుపు రుచి చూసిందే లేదు. ఇదిగో.. ఇన్నాళ్లకు కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలోని యువ ఆటగాళ్లు కలిసికట్టుగా చరిత్రాత్మక విజయాన్ని కళ్లముందుంచారు. 608 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్‌ను పేసర్ ఆకాశ్ దీప్ ఆరు వికెట్లతో దెబ్బతీయడంతో మరో సెషన్ ఉండగానే జట్టు సంబరాలు చేసుకుంది. అంతకుముందు గిల్ బాదిన డబుల్ సెంచరీ, భారీ శతకం ఈ విజయంలో అత్యంత కీలకంగా నిలిచాయనడంలో సందేహం లేదు.**



బర్మింగ్‌హామ్: టీమిండియా విజయ లాంఛనాన్ని ముగించింది. చివరి రోజు ఆదివారం ఇంగ్లండ్ డ్రా కోసం ప్రయత్నిస్తుందనుకున్నా.. భారత బౌలర్లు వారి ఆటలు సాగనీయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సిరాజ్ సత్తాచాటితే, రెండో ఇన్నింగ్స్‌లో పేసర్ ఆకాశ్‌దీప (6/99) స్టోక్స్ సేన భరతం పట్టాడు. దీంతో ఇంగ్లండ్‌పై 336 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. ఐదు టెస్టుల సిరీసలో 1-1తో సమంగా నిలిచింది. ఎడ్జ్‌బాస్టన్‌లో 58 ఏళ్ల తర్వాత భారత్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 1967 నుంచి ఇప్పటిదాకా ఆడిన ఎనిమిది టెస్టుల్లో ఏడింటిలో ఓడిన భారత్, ఓ మ్యాచ్‌ను డ్రాగా చేసుకుంది. ఇక.. 608 పరుగుల ఛేదనలో ఆతిథ్య ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 271 పరుగులకే కుప్పకూలింది. జేమీ స్మిత్ (88), బ్రైడన్ కార్స్ (38), సారథి బెన్ స్టోక్స్ (33) రాణించారు. మ్యాచ్ మొత్తమ్మీద పేసర్ ఆకాశ్‌కు పది వికెట్లు దక్కాయి. కెప్టెన్‌గా తొలి విజయం అందుకున్న శుభ్‌మన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

**ఆరంభంలోనే రెండు వికెట్లు:**

చివరి రోజు ఆటకు ముందు వర్షం కురవగా, తొలి సెషన్‌కు గంటా 40 నిమిషాలపాటు అంతరాయం కలిగింది. ఈ కారణంగా మూడు సెషన్లను 80 ఓవర్లకు కుదించారు. ఇక 608 పరుగుల అసాధ్య ఛేదన కోసం 72/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. అయితే ఆకాశ్ చక్కటి సీమ్‌తో వీరిని కుదురుకోనీయలేదు. సెషన్ నాలుగో ఓవర్‌లోనే పోప్ (24)ను బౌల్డ్ చేశాడు. తన తర్వాతి ఓవర్‌లోనే బ్రూక్ (23)ను ఎల్బీ చేయడంతో ఇంగ్లండ్ 83/5 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ ఊపులో వికెట్ల పతనం సాగుతుందనిపించినా.. స్టోక్స్-స్మిత్ జోడీ నిలువరించింది. స్పిన్నర్ జడేజా మాత్రం వీరిని ఇబ్బందిపెట్టాడు. కానీ సిరాజ్ ఓవర్లలో మాత్రం స్టోక్స్ బౌండరీలు రాబట్టాడు. లంచ్ బ్రేక్‌కు మరో రెండు నిమిషాలు ఉండగా బంతి తీసుకున్న జడేజా 100 సెకన్లలోనే ఆ ఓవర్‌ను ముగించాడు. దీంతో మరో ఓవర్‌కు సమయం మిగిలింది. ఈ ఓవర్‌ను స్పిన్నర్ సుందర్ వేసి స్టోక్స్ వికెట్ తీయడంతో ఇంగ్లండ్‌కు గట్టి ఝలక్ తగిలింది. అలాగే ఆరో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

**కూల్చారు...:**

విజయానికి కేవలం నాలుగు వికెట్ల దూరంలో భారత్ రెండో సెషన్‌ను ఆరంభించింది. అయితే వోక్స్ (7) డిఫెన్స్‌కు పరిమితం కాగా స్మిత్ ఎదురుదాడికి దిగాడు. సుందర్ ఓవర్‌లో అతడు 6,4,6తో 17 రన్స్ రాబట్టాడు. అటు వోక్స్‌ను ప్రసిద్ధ్ అవుట్ చేసి ఇంగ్లండ్‌పై ఒత్తిడి పెంచాడు. కాసేపటికే ఆకాశ్ ఓవర్‌లో స్మిత్ వరుసగా రెండు సిక్సర్లు బాదాడు. అయితే అదే ఓవర్‌లో స్లో బాల్‌కు స్మిత్ ఆడిన పుల్ షాట్ సుందర్ చేతుల్లో పడింది. దీంతో ఆకాశ్ తొలిసారి ఐదు వికెట్ల ఫీట్ సాధించాడు. అటు జడేజా ఓవర్‌లో కార్స్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో ఉన్న రాహుల్ వదిలేశాడు. కానీ టంగ్ (2) క్యాచ్‌ను షార్ట్ మిడ్ వికెట్‌లో సిరాజ్ తన కుడి వైపునకు డైవ్ చేస్తూ ఒంటి చేత్తో అందుకున్నాడు. ఇక చివరి వికెట్‌ను త్వరగా తీద్దామనుకున్న భారత్‌ను కార్స్-బషీర్ కాసేపు విసిగించారు. పైగా బషీర్ (12 నాటౌట్) ఓ సిక్స్ బాదగా.. ఆకాశ్ ఓవర్‌లో కార్స్ మూడు ఫోర్లు సాధించాడు. చివరకు పదో వికెట్‌కు 25 పరుగుల భాగస్వామ్యం అందించాక కార్స్‌ను ఆకాశ్ అవుట్ చేయడంతో భారత్ అద్భుత విజయం దక్కించుకుంది.

**స్కోరుబోర్డు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 587బీ
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 407బీ
భారత్ రెండో ఇన్నింగ్స్: 427/6 డిక్లేర్‌బీ
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: డకెట్ (బి) ఆకాశ్‌దీప్ 25, క్రాలే (సి/సబ్) సాయి సుదర్శన్ (బి) సిరాజ్ 0, పోప్ (బి) ఆకాశ్‌దీప్ 24, రూట్ (బి) ఆకాశ్‌దీప్ 6, బ్రూక్ (ఎల్బీ) ఆకాశ్‌దీప్ 23, స్టోక్స్ (ఎల్బీ) వాషింగ్టన్ 33, జేమీ స్మిత్ (సి) వాషింగ్టన్ (బి) ఆకాశ్‌దీప్ 88, వోక్స్ (సి) సిరాజ్ (బి) ప్రసిద్ధ్ 7, కార్స్ (సి) గిల్ (బి) ఆకాశ్‌దీప్ 38, టంగ్ (సి) సిరాజ్ (బి) జడేజా 2, బషీర్ (నాటౌట్) 12బీ ఎక్స్‌ట్రాలు: 13బీ మొత్తం: 68.1 ఓవర్లలో 271 ఆలౌట్‌బీ వికెట్ల పతనం: 1-11, 2-30, 3-50, 4-80, 5-83, 6-153, 7-199, 8-226, 9-246, 10-271బీ బౌలింగ్: ఆకాశ్‌దీప్ 21.1-2-99-6, సిరాజ్ 12-3-57-1, ప్రసిద్ధ్ 14-2-39-1, జడేజా 15-4-40-1, వాషింగ్టన్ సుందర్ 6-2-28-



## క్వార్టర్స్‌లో సబలెంక

లండన్: టాప్ సీడ్ అర్యానా సబలెంక వింబుల్డన్ టైటిల్ దిశగా మరో అడుగు వేసింది. ఈ బెలారస్ భామ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. పురుషుల ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్, 17వ సీడ్ ఖచనోవ్ కూడా రౌండ్-8కి చేరారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైన్లో ప్రపంచ నెంబర్ వన్ సబలెంక 6-4, 7-6 (4)తో 24వ సీడ్ మెర్టెన్స్‌పై గెలుపొందింది. ఇతర మ్యాచ్‌ల్లో లారా సిగ్మండ్ 6-3, 6-2తో సీరాపై, పల్యుచెన్కోవా 7-6 (3), 6-4తో సోనె కర్తాల్‌పై నెగ్గారు. పురుషుల సింగిల్స్‌లో ఫ్రిట్జ్ 6-1, 3-0తో జోర్డాన్‌పై ఆధిక్యంలో ఉన్నప్పుడు గాయంతో ప్రత్యర్థి వైదొలిగాడు. దాంతో ఫ్రిట్జ్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరాడు. 17వ సీడ్ ఖచనోవ్ 6-4, 6-2, 6-3తో మచ్‌జక్‌ని ఓడించాడు.



## ముల్డర్ డబుల్

### దక్షిణాఫ్రికా 465 4

బులవాయో: కెప్టెన్ ముల్డర్ (264) అజేయ ద్విశతకంతో చెలరేగిన వేళ..జింబాబ్వేతో రెండో టెస్టు తొలిరోజే దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 465/4 స్కోరు చేసింది. బెడింగ్‌హామ్ (82)తో కలిసి మూడో వికెట్‌కు 184 పరుగులు జోడించిన ముల్డర్..ప్రిటోరియస్ (78)తో నాలుగో వికెట్‌కు 217 రన్స్ జత చేశాడు.

## డబుల్ సెంచరీ కొట్టి తీరుతా..

### ఇంగ్లండ్‌కు సూర్యవంశీ వార్నింగ్!



14 ఏళ్ల వయసులోనే స్టార్‌డమ్ సంపాదించాడు వైభవ్ సూర్యవంశీ. అండర్-19లో ఆడుతూ వెలుగులోకి వచ్చిన ఈ యువ బ్యాటర్.. ఐపీఎల్-2025తో ఓవర్‌నైట్ స్టార్‌గా అవతరించాడు. క్యాష్ రిచ్ లీగ్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున బరిలోకి దిగిన సూర్యవంశీ.. 7 ఇన్నింగ్స్‌ల్లో కలిపి 252 పరుగులు చేశాడు. ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్ కొట్టాడు. 35 బంతుల్లోనే సెంచరీ బాది పాత రికార్డులకు పాతర వేశాడు. అక్కడితో ఆగని వైభవ్.. ఇంగ్లండ్ టూర్‌లో భారత అండర్-19 జట్టుకు ఆడుతూ 52 బంతుల్లోనే మెరుపు శతకం బాదాడు. 10 ఫోర్లు, 7 సిక్సులు బాదిన సూర్యవంశీ.. 78 బంతుల్లో 143 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. అలాంటోడు ప్రత్యర్థులకు మరోమారు హెచ్చరికలు జారీ చేశాడు. ఇంతకీ వైభవ్ ఏమన్నాడంటే..

**గిల్ స్ఫూర్తితో..**

యూత్ వన్డే క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టిన ప్లేయర్‌గా నిలవడంపై వైభవ్ సూర్యవంశీ స్పందించాడు. రికార్డు సృష్టించినట్లు తనకు తెలియదని అన్నాడు. 'నేను రికార్డు సృష్టించాననే విషయం నాకే తెలియదు. 100 మార్క్‌ను అందుకున్నాక మా టీమ్ మేనేజర్ అంకిత్ ఈ విషయం చెప్పారు. నెక్ట్స్ మ్యాచ్‌లో డబుల్ సెంచరీ కొట్టాలని అనుకుంటున్నా. తప్పకుండా 50 ఓవర్లు బ్యాటింగ్ చేసి 200 మార్క్‌ను అందుకోవాలని భావిస్తున్నా. నేను ఎంత ఎక్కువగా పరుగులు చేస్తే అది టీమ్‌కు అంత మంచి చేస్తుంది' అని వైభవ్ సూర్యవంశీ చెప్పుకొచ్చాడు. టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తనకు స్ఫూర్తి అని పేర్కొన్నాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో గిల్ బ్యాటింగ్ అదిరిపోయిందని, అతడిలా భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని అనుకుంటున్నానని తెలిపాడు. మరింత నిబద్ధత, క్రమశిక్షణతో బ్యాటింగ్ చేయాలని భావిస్తున్నానని వ్యాఖ్యానించాడు.



## గుకేష్‌కు మూడో స్థానం

### విజేత కార్ల్‌సన్

జాగ్రెబ్ (చెక్ రిపబ్లిక్): గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరిగిన సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో వరల్డ్ చాంపియన్ గుకేష్ ఓవరాల్‌గా 19.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలవగా.. ప్రజ్ఞానంద 15 పాయింట్లతో 9వ స్థానం దక్కించుకొన్నాడు. కార్ల్‌సన్ 22.5 పాయింట్లతో టోర్నీ విజేతగా నిలవగా.. సో వెస్లీ (20)కి రెండోస్థానం దక్కింది. బ్లిట్జ్‌లో కార్ల్‌సన్ (12.5) అగ్రస్థానాన్ని దక్కించుకొన్నాడు. కాగా, ర్యాపిడ్‌లో 14 పాయింట్లతో విజేతగా నిలిచిన గుకేష్.. బ్లిట్జ్‌లో 18 రౌండ్ల నుంచి 5.5 పాయింట్లతో చివరిస్థానానికే పరిమితమయ్యాడు.

# గోల్డ్ లోన్ కొత్త రూల్స్ ఇవే..




అత్యవసర సమయాల్లో అందరికీ గుర్తొచ్చేవి గోల్డ్ లోన్సే. వైద్యం, విద్య, వ్యాపారం, వ్యవసాయం ఇలా చెప్పుకుంటూపోతే మన ప్రతీ నగదు అవసరాలు వేగంగా తీరే మార్గం ఒక్క బంగారం తనఖా రుణాల ద్వారానే ఉంటుందంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. పైగా పసిడి తాకట్టుపై ఇచ్చే ఈ రుణాలు సెక్యూర్డ్ లోన్స్. కాబట్టి రుణదాత (బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు)లూ వీటికి అమితాసక్తినే కనబరుస్తూంటారు. అయితే ఈ బిజినెస్‌లో అవకతవకలకు వీలుందన్నదానిపై దృష్టిపెట్టిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. ఇటీవల నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఈ నిబంధనల్ని గోల్డ్ లోన్ తీసుకోవాలనుకునే ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

- బుల్లెట్ రీపేమెంట్ పథకాల్లో చెల్లింపుల కోసం ఉండే గరిష్ఠ కాలపరిమితి 12 నెలలకు పరిమితం.
- 36 నెలలదాకే ఈఎంఐ ఆధారిత రుణాల కాలపరిమితి.
- మునుపు గోల్డ్ లోన్స్ ఏటా రెన్యువల్ చేసుకునే వీలుండేది. ఇప్పుడది లేదు.
- బ్యాంకుల ద్వారా తీసుకునే రుణం రూ.2.5 లక్షలలోపే ఉంటే.. తనఖా పెట్టిన బంగారం మార్కెట్ విలువలో 85 శాతం రుణంగా వస్తుంది. బ్యాంకిగేతర ఆర్థిక సంస్థలు, స్మాల్ బ్యాంకుల్లో ఇది 88 శాతంగా ఉన్నది.
- అల్పాదాయ, గ్రామీణ రుణగ్రహీతలకు ఊరటనిచ్చేలా రూ.2.5 లక్షలలోపు రుణాలకు ఆదాయ మదింపు, క్రెడిట్ స్కోర్ తనిఖీలు లేవు.
- బంగారు నగలైతే కిలోదాకా, బంగారు నాణేలైతే 50 గ్రాములదాకా, వెండి ఆభరణాలైతే 10 కిలోలదాకా, వెండి నాణేలైతే 500 గ్రాములదాకా తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవచ్చు.
- రుణం తీర్చేసిన రోజే తనఖా పెట్టిన బంగారం, వెండిని రుణగ్రహీతలకు రుణదాతలు ఇచ్చేయాలి. ఇక 7 పనిదినాలు దాటినా ఏ కారణంచేతనైనా ఇవ్వకపోతే రోజుకు రూ.5,000 నష్టపరిహారాన్ని రుణగ్రహీతలకు చెల్లించాలి.
- తాకట్టు పెట్టిన బంగారం, వెండి పోయినా, డ్యామేజీ అయినా రుణగ్రహీతలకు పూర్తిస్థాయిలో రుణదాతలే ఇవ్వాల్సి ఉంటుంది.
- రుణం తీర్చకపోతే తనఖా పెట్టిన వాటిని వేలం వేసే ముందు తప్పకుండా రుణగ్రహీతలకు రుణదాతలు నోటీసు ద్వారా తెలియజేయాలి.
- వేలంలో కనీస ధరను బంగారం, వెండి మార్కెట్ విలువలో 90 శాతంగా నిర్ణయించాలి.
- వేలం వేయగా మిగిలిన బంగారం, వెండిని రుణగ్రహీతలకు రుణదాతలు వారం రోజుల్లో తిరిగి అప్పగించాలి.




# పెట్రోకెమికల్స్ రంగంలోకి అదానీ

## గుజరాత్‌లో పీవీసీ ప్లాంట్

**న్యూఢిల్లీ:** గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. కొత్తగా పెట్రో రసాయనాల (పెట్రో కెమికల్స్) రంగంలోకి ప్రవేశిస్తోంది. ఇందులో భాగంగా గుజరాత్‌లోని ముంద్రా వద్ద ఏటా 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న పోలీవినైల్ క్లోరైడ్ (పీవీసీ) ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. 2027-28 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని అదానీ గ్రూప్ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో ఇప్పటికే ఈ రంగంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీసకు గట్టి పోటీ ఏర్పడుతుందని భావిస్తున్నారు.

**భారీ డిమాండ్**

సింథటిక్ పాలిమర్ అయిన పీవీసీని అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం మన దేశంలో దీనికి ఏటా 40 లక్షల టన్నుల వరకు డిమాండ్ ఉంది. ఇందులో 15.9 లక్షల టన్నులు మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అవుతోంది. అందులో రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటా 7.5 లక్షల టన్నులు. దేశంలో పీవీసీ డిమాండ్ ఏటా 8-10 శాతం చొప్పున పెరుగుతోంది. ఈ అవకాశాల్ని అందిపుచ్చుకునేందుకే అదానీ గ్రూప్ పీవీసీ ఉత్పత్తిలోకి ప్రవేశిస్తోందని భావిస్తున్నారు.

**మధ్యలో ఆటంకం**

నిజానికి ఐదేళ్ల క్రితమే అదానీ గ్రూప్ ఈ ప్రాజెక్టు తలపెట్టింది. అయితే హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో 2023 మార్చిలో ఈ ప్రాజెక్టును పక్కన పెట్టింది. పరిస్థితులు కుదుటపడడంతో మళ్లీ ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించింది. డిమాండ్‌ను బట్టి ఈ ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 20 లక్షల టన్నులకు విస్తరించాలని అదానీ గ్రూప్ యోచిస్తున్నట్టు తెలుస్తోంది.

# పీఎస్‌బీల్లో కొలువుల జాతర

## ఈ సంవత్సరం 50,000 పోస్టుల భర్తీ

## ఒక్క ఎస్‌బీఐలోనే 20 వేల నియామకాలు

న్యూఢిల్లీ: దేశంలోని 12 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూటు మార్చాయి. పెద్ద ఎత్తున నియామకాలకు సిద్ధమవుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం దాదాపు 50,000 నిమామకాలు చేపట్టనున్నాయి. ఇందులో 21,000 ఉద్యోగాలు ఆఫీసర్ పోస్టులు. మిగతా 29,000 క్లరికల్ పోస్టు లు. ఇవే బ్యాంకులు గతంలో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందనే పేరుతో 2001లో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) పథకం ద్వారా లక్ష మంది పైగా ఉద్యోగులను ఇంటికి పంపించాయి. అప్పట్లో 26 పీఎసబీలుంటే విలీనాలతో ఇపుడు వాటి సంఖ్య 12కు తగ్గిపోయింది. అయినా పీఎసబీలు మళ్లీ పెద్ద ఎత్తున నియామకాలకు దిగడం విశేషం. పెరుగుతున్న వ్యాపారం, శాఖల విస్తరణ, ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఈ నియామకాలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.


**ఎస్‌బీఐదే పెద్ద వాటా**

పీఎసబీలు ఈ ఆర్థిక సంవత్సరం భర్తీ చేసే 50,000 ఉద్యోగాల్లో ఎస్‌బీఐ వాటానే దాదాపు 20,000 వరకు ఉంది. ఇందులో 505 ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ) పోస్టులుబీ 13,455 జూనియర్ అసోసియేట్స్ పోస్టుల ఎంపిక ప్రక్రియను ఇప్పటికే పూర్తి చేసింది. ఈ ఏడాది మార్చి నాటికి ఎస్‌బీఐ ఉద్యోగుల సంఖ్య 2,36,226కు చేరింది. ఇందులో అధికారుల సంఖ్య 1,15,066 వరకు ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఒక్కో కొత్త ఉద్యోగి నియామకం కోసం ఎస్‌బీఐ రూ.40,440.59 చొప్పున ఖర్చు చేసింది. ఎస్‌బీఐతో పాటు పీఎన్‌బీ 5,500 మందిని, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 4,000 మందిని తాజాగా ఉద్యోగాల్లోకి తీసుకోనున్నాయి.

**ఎందుకంటే?**

పీఎసబీలకు ప్రస్తుతం దాదా పు 15 వరకు అనుబంధ లేదా జాయింట్ వెంచర్ కంపెనీలున్నాయి. వీటి కార్యకలాపాలను మరింత విస్తరించి ఐపీఓల ద్వారా వాటిల్లో పెట్టుబడులు కొంతైనా వెనక్కి తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవల పీఎసబీలను కోరింది. ఇందుకోసం కూడా పీఎసబీలు నియామకాలు పెంచుతున్నాయని భావిస్తున్నారు.




# క్రెడిట్ కార్డులపై ఈ అపోహలు వద్దు

నగదు అవసరాల్లో క్రెడిట్ కార్డులు కొంత వెసులుబాటును, మరికొంత సౌకర్యాన్నిస్తాయి. అయితే వీటిపై నెలకొన్న కొన్ని అపోహలు.. వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఫలితంగా అవి వారి ఆర్థిక సామర్థ్యాన్నీ దెబ్బతీస్తున్నాయి. నిజానికి డిజిటల్ ఫైనాన్స్ నానాటికీ విస్తృతంగా విస్తరిస్తున్న నేపథ్యంలో క్రెడిట్ కార్డులపై పేరుకుపోయిన అపోహలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మరి నిపుణులు ఏం చెప్తున్నారు?

మినిమం పేమెంట్స్‌పై క్రెడిట్ కార్డుపైనున్న బకాయిని పూర్తిగా చెల్లించకుండా మినిమం పేమెంట్స్ లేదా దానిపై వడ్డీలు చెల్లిస్తూపోతే క్రెడిట్ స్కోర్ పెరుగుతుందని చాలామంది అనుకుంటున్నారు. కానీ ఇది అపోహే. ప్రతి నెలా మీ బకాయిలను పూర్తిగా చెల్లించడమే మంచిది. అప్పుడే క్రెడిట్ స్కోర్ పెరగడానికి వీలుంటుంది. కాబట్టి నెలనెలా మీ పూర్తిస్థాయి బకాయి వాయిదాలను చెల్లిస్తూ వడ్డీ చార్జీలకు దూరంగా ఉండండి. దీనివల్ల రుణదాత (బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు)లకు మీ ఆర్థిక క్రమశిక్షణ నచ్చుతుంది. అది అంతిమంగా మీ క్రెడిట్ స్కోర్ పురోగతికి దోహదపడగలదు.

పాత కార్డులపై వాడని పాత క్రెడిట్ కార్డులను క్లోజ్ చేసుకోవాలన్నది మంచి ఆలోచనే. అయితే అది మీ క్రెడిట్ స్కోర్‌ని దెబ్బతీసే అవకాశమున్నది. ఎందుకంటే పాత కార్డులను తీసేస్తే మీకు అందుబాటులో ఉండే మొత్తం రుణ పరిమితి తగ్గిపోతుంది. కాబట్టి మీ పాత కార్డులనూ ఉంచుకోండి. ప్రధానంగా వార్షిక చార్జీలు లేకపోతే అస్సలు వాటిని వదులుకోవద్దు.

**ఒక్కటే కార్డు..**

అసలు ఒక్క క్రెడిట్ కార్డూ లేకపోవడం కంటే ఒకటైనా ఉండటం ఉత్తమం. అయితే ఒకటికి మించి క్రెడిట్ కార్డులు ఉండటం వల్ల మీ రుణ పరపతికి అవి అద్దం పడుతాయి. రివార్డు పాయింట్లు పెరిగి మీ క్రెడిట్ స్కోర్, అందుబాటులో ఉండే రుణ లభ్యత కూడా పెరుగుతుంది. కనుక రోజువారీ అవసరాలకు, ప్రయాణాలు లేదా రివార్డులకు, తక్కువ అధిక రుణాల కోసం ఇలా వేర్వేరు అవసరాలకు 2-3 క్రెడిట్ కార్డులను మెయింటేన్ చేయండి.

**రుణ భారం**


క్రెడిట్ కార్డులను దుర్వినియోగం చేస్తేనే రుణ భారం పెరుగుతుంది. నిజానికి సరిగ్గా వాడితే ఇవి శక్తివంతమైన ఆర్థిక సాధనాలే. వడ్డీరహిత రుణాలు, రివార్డులు తదితర ప్రయోజనాలను పొందవచ్చు.

**కొత్త కార్డులు**

క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవడం వల్ల క్రెడిట్ స్కోర్ దెబ్బతింటుంది అన్నది కూడా పూర్తిగా నిజం కాదు. అయితే అతిగా క్రెడిట్ కార్డుల కోసం ఆరా తీయడం, దరఖాస్తులు చేసుకోవడం మాత్రం ఇబ్బందికరమే. కానీ ఏటా ఒకటి లేదా రెండు విచారణలు క్రెడిట్ కార్డుల కోసం చేయడం వల్ల క్రెడిట్ స్కోర్‌కు దీర్ఘకాలంలో వచ్చే ప్రమాదమేమీ లేదు. పైగా కొత్త కార్డుతో క్రెడిట్ స్కోర్ పెరిగేందుకే ఎక్కువగా అవకాశాలున్నాయి.

**డెబిట్ కార్డులే ఉత్తమం?**

క్రెడిట్ కార్డుల కంటే డెబిట్ కార్డులే ఉత్తమమన్న అభిప్రాయం చాలామందిలో ఉన్నది. అయితే మీ ఖాతాలో నగదు నిల్వలున్నప్పుడే డెబిట్ కార్డులకు విలువ. కానీ క్రెడిట్ కార్డులతో చేతిలో నగదు లేకున్నా.. కనీస అవసరాలను తీర్చుకునే వెసులుబాటు ఉంటుంది. షాపింగ్‌లు, ఇతర కొనుగోళ్లలో నగదు రాయితీలు, ప్రోత్సాహకాలనూ పొందవచ్చు. అయితే మితిమీరిన ఖర్చులు చేస్తే మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయం. కాబట్టి వివేకంతో వ్యవహరించాలి.



# నిలకడగా బంగారం ధరలు

భారతీయ సంస్కృతిలో బంగారానికి ఉన్న ప్రాధాన్యత ఇతర ఏ లోహానికి కూడా లేదు. శుభకార్యాలకు తప్పని సరిగా బంగారం అవసరం అవుతూ ఉంటుంది. మరీ ముఖ్యంగా పెళ్లిళ్లకు బంగారమే ప్రధానం. అలాంటి బంగారం నేడు అత్యంత ఖరీదైన వస్తువుగా మారిపోయింది. పేద, మధ్య తరగతి వాళ్లకు అందని ద్రాక్షగా మారింది. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 98 వేల దగ్గర ట్రేడ్ అవుతోంది. వారం క్రితం 99 వేల దగ్గర ట్రేడ్ అయిన 24 క్యారెట్ల బంగారం ధర.. ఇప్పుడు కొంచెం కొంచెంగా తగ్గుతూ వస్తోంది. ఇక, ఈ రోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే..

**నగరంలో బంగారం ధరలు..**

హైదరాబాద్ మహా నగరంలో నిన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,830 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,600 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 90,600 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు బంగారం ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ధరలు నిలకడగా ఉన్నాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,830 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,600 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,130 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

**వెండి ధరలు..**

నిన్న హైదరాబాద్ నగరంలో 100 గ్రాముల వెండి ధర 12,000 దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,20,000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు వెండి ధరల్లో కూడా ఎలాంటి మార్పులేదు. 100 గ్రాముల వెండి ధర నేడు 12,000 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ వెండి ధర 1,20,000 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# ఆన్లైన్ ద్వారా ఉచిత స్పర్శదర్శనం టికెట్లు

**శ్రీశైలం, జూలై 6 :** సామాన్య భక్తుల సౌకర్యార్థం జూలై 1న తిరిగి ప్రారంభమైన ఉచిత స్పర్శదర్శనం ఉచిత స్పర్శదర్శనానికి భక్తుల నుంచి అనూహ్య స్పందన ఉచిత స్పర్శదర్శనం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు ఉచిత స్పర్శదర్శనాలలో భక్తులు అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు ఆన్లైన్లో టోకెన్ల జారీ జూలై 1వ తేదీ నుంచి ప్రారంభించబడిన శ్రీస్వామివార్ల ఉచిత స్పర్శదర్శనానికి భక్తులనుంచి అనూహ్య స్పందన లభించిదని కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉచిత స్పర్శదర్శనం పునః ప్రారంభించిన రోజున తాను పలువురు భక్తులతో ముఖాముఖిగా సంభాషించి, వారి అభిప్రాయాలను అడగడం జరిగిందన్నారు. భక్తులందరు కూడా ఉచిత స్పర్శదర్శనం ప్రారంభం పట్ల ఎంతో సంతృప్తివ్యక్తం చేశారన్నారు. గతంలో వలనే వారంలో నాలుగురోజులపాటు అనగా మంగళవారం నుంచి శుక్రవారం వరకు ఈ ఉచిత స్పర్శదర్శనాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. ఉచిత స్పర్శదర్శన సదుపాయ ఏర్పాట్లకు సంబంధించి కార్యనిర్వహణా ధికారివారు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని విభాగాల యూనిట్ అధికారులు మరియు పర్యవేక్షకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ సామాన్య భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచడంలో భాగంగానే ఈ ఉచిత స్పర్శదర్శనం పునః ప్రారంభించడం జరిగిందన్నారు. శ్రీమల్లికార్జునస్వామివారిని భక్తులు స్వయంగా స్పర్శించడం వలన ఎంతో ఆధ్యాత్మికానుభూతిని పొందుతారన్నారు. అందుకే ఈ ఉచిత స్పర్మదర్శన నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. ఏ ఒక్క భక్తుడు కూడా ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండాలన్నారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవలసిన బాధ్యత దేవస్థానంపై ఉందన్నారు. ఈ కారణంగా ఈ ఉచిత స్పర్శదర్శన విధివిధానాల గురించి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. ఉచిత స్పర్శదర్శనం పొందగోరే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు ఉచిత స్పర్శదర్శన టోకెన్లను ఆన్లైన్లో అందుబాటులో ఉంచాలని నిర్ణయించడం జరిగింది. ప్రస్తుతం స్పర్శదర్శనం టికెట్లు మరియు ఆయా ఆర్జితసేవాటికెట్లను పొందినట్లుగా భక్తులు ఉచిత స్పర్శదర్శనం కాగా ఉచిత స్పర్శదర్శనానికి సంబంధించి రోజుకు 1000టోకన్లుమాత్రమే అందుబాటులో.. www.srisalladevasthanam.org www. aptemples.ap.gov.in ఉచిత టోకన్లు పొందవచ్చు. ప్రస్తుతం పరోక్ష సేవ విధానానికి అమలులో ఉన్నట్లుగానే ఈ ఉచితటోకన్లు కూడా భక్తులు ఒక్కరోజు ముందుగా ఆన్లైన్ ద్వారా పొందవలసివుంటుంది. అనగా మంగళవారం మధ్యాహ్నం స్పర్శదర్శనం చేసుకోవలసిన భక్తులు సోమవారం నాడే నిర్దిష్ట సమయంలోగా ఈ టోకన్లు ఆన్లైన్ నందు పొందవలసివుంటుంది. ఆన్లైన్ లో టోకన్లు పొందే సమయంలో భక్తుల పేరు, చిరునామా, ఆధార్నెం మరియు ఫోను నెంబర్లను విధిగా నమోదు చేయవలసి వుంటుంది. భక్తులు ఆన్లైన్ ద్వారా పొందిన టికెట్లను స్కానింగ్ చేయడం ద్వారా మరియు ఆధార్ గుర్తింపుతో పోల్చిన తదుపరే భక్తులను దర్శనానికి అనుమతించడం జరుగుతుంది. ఉచిత స్పర్శదర్శనం విధానంలో పారదర్శకత మరియు జవాబుదారీతనం కోసం ఈ ఆన్లైన్ టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరుగుతోంది. కాగా మధ్యాహ్నవేళల తరువాత ఆలయశుద్ధి, మంగళ వాయిద్యాలు, సుసాంధ్యము, ప్రదోషకాల పూజలను నిర్వహించవలసి వున్నందున మధ్యాహ్నం గం. 1.45ల నుంచి ఈ ఉచిత స్పర్శదర్శనం కల్పించబడుతోంది. కాగా ఎవరైనా ఈ ఉచిత ఆన్లైన్ టోకెన్ విధానాన్ని దుర్వినియోగం చేసినట్లయితే చట్టప్రకారం తగు చర్యలు చేపట్టబడుతాయి. కావున భక్తులందరు కూడా తగువిధంగా ఆన్లైన్ ద్వారా టోకన్లను పొంది, స్వామివారి ఉచిత స్పర్శదర్శనాన్ని పొందవలసినదిగా కోరుతున్నాము.



# శ్రీశైల కౌండిన్య సత్రం నందు శ్రీశైల దేవస్థానం నూతన కమిటీ ఏర్పాటు

శ్రీశైలం, జూలై 6 : శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు తగిన వసతి, భోజన సదుపాయాలను అందించుటకు దేవస్థాన పరిధిలో ఉన్న ఏర్పాట్లకు అదనముగా వారి వారి సామాజిక వర్గ భక్తులు వచ్చునప్పుడు అసౌకర్యము కలగకుండా ఉండుటకుగాను వారి అభ్యర్థన మేరకకు దేవస్థానము భూమిని కేటాయించడమైనది. అటువంటి సామాజిక సత్రములలో శ్రీశైల కౌండిన్య గౌడసత్రం ఒకటి. సదరు సత్రము నిర్వహణలో వచ్చిన అభిప్రాయబేధముల దృష్ట్యా నూతనంగా తాత్కాలిక కార్యనిర్వహక వర్గమును దేవస్థానము ఆధ్వర్యములో ఏర్పాటు చేయవలసినదిగా మార్చిలో ఈ దేవస్థానమునకు సదరు సత్రనిర్వహకులు కోరియున్నారు.అందుకు అనుగుణంగా దేవస్థానము సిబ్బంది వారి సమక్షములో శ్రీశైలంలో గల కౌండిన్యగౌడ సత్రం నూతన తాత్కాలిక కార్యనిర్వహక వర్గమును ఏర్పాటు చేయుటకు ఈ నెల 24వ తేదీని నిర్ణయించడమైనది. సదరు ప్రత్యేక సమావేశమును నిర్వహించుటకుగాను దేవస్థానపు సిబ్బంది అయిన 1. శ్రీ ఇ. చంద్రశేఖరరెడ్డి, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, 2. శ్రీ పి. మురళీబాలకృష్ణ, కార్యనిర్వహక ఇంజనీరు, 3. శ్రీ యం. శ్రీనివాసరావు, పర్యవేక్షకులు 4. శ్రీ యం. మల్లికార్జున, పర్యవేక్షకులు, సి.ఎస్.ఓ, 5. ఇ. మల్లిక్ రాజ, పర్యవేక్షకులు, 6. కె. శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ వారిని సభ్యులుగా నియమించడం జరిగింది. కనుక పై తెలిపిన తేది:24.07.2025న ఉదయం గం.11.00లకు శ్రీశైలకౌండిన్య గౌడసత్రములో జరపబడు ప్రత్యేక సమావేశములో పాల్గొని వివాదరహిత తాత్కాలిక కార్యనిర్వాహక వర్గమును ఏర్పాటు చేసుకొనవలసినదిగా కౌండిన్య గౌడ పెద్దలను, డోనర్లకు తెలియజేయుచూ ఈ పత్రికా ప్రకటనను జారీ చేయడమైనది.

# యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

## ధర్మదర్శనానికి 3 గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం

## రూ.57.28 లక్షల ఆదాయం



యాదగిరిగుట్ట జూలై 6 : : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. రద్దీ కారణంగా బస్ బే, ధర్మదర్శన, ప్రత్యేక దర్శన క్యూలైన్లు, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు సందడిగా మారాయి. రద్దీతో స్వామివారి దర్శనానికి మూడు గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయంలో నిర్వహించిన నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపు సేవలో ముగిశాయి. ఇక భక్తులు జరిపించిన నిత్య పూజలు, నిత్య కైంకార్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.57,28,842 ఆదాయం వచ్చింది. ప్రసాద విక్రయం ద్వారా రూ.16,20,640, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.5.86 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.9 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.5,27,400 ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

**ఘనంగా తొలి ఏకాదశి పూజలు**

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపం స్వామిఅమ్మవార్లను స్వర్ణవేదికపై అధిష్టింపజేసి లక్షపుష్పార్చన పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేకంగా తెప్పించిన రకరకాల పూలతో అర్చనలు చేపట్టారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల హోరులో సహస్రనామాలను పఠిస్తూ ఏకాదశి పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి సేవలో తోగుట పీఠాధిపతి**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని తోగుట పీఠాధిపతి మాధవానంద దేవానంద సరస్వతి స్వామిజీ ఆదివారం దర్శించుకున్నారు. ప్రధానాలయంలోని గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం)లో ఆలయంలో లింగమూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శివకేశవుల దర్శనం కల్పించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో ఆలయ అర్చకులకు, అధికార బృందానికి పండిత గోష్టి నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని మంగళాశాసనాలు చేశారు. అనంతరం పీఠాధిపతికి ఆలయ చైర్మన్ నరసింహమూర్తి లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేయగా.. ఆలయ ఈవో వెంకటరావు నారసింహుడి ఫొటోను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సూపరింటెండెంట్ రాజన్ బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.





# 8న నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో బోనాలు



సంగా రెడ్డి,జనతా న్యూస్:: సంగారెడ్డి:ఆషాడమాస బోనాలను నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8న మంగళవారం నిర్వహించనున్నట్లు నాయి బ్రాహ్మణ ఉద్యోగ సంఘం నాయకులు సుకుమార్ తెలిపారు. బోనాల సన్నాహక సమావేశాన్ని ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఆషాడ మాస బోనాల సమర్పణలో నాయి బ్రాహ్మణులకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. సాంప్రదాయాల మేరకు నాయి బ్రాహ్మణులు గ్రామ దేవతలకు బోనాలను సమర్పించడం తప్పనిసరి అని గుర్తు చేశారు. నాయి బోనాల ఊరేగింపులో నాయి సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు. బోనాల ఊరేగింపు స్థానిక ఐబి అతిథి గృహం నుండి ప్రారంభమై నల్ల పోచమ్మ మందిరం గుండా అస్తబల్ రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మహిళ విభాగం నాయకురాలు సుధామణి, నాయకులు యాదయ్య, సత్యం, సాయినాథ్, రాజారామ్, దత్తయ్య, కిరణ్, నాగభూషణం, గోపాల్, నర్సింలు, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



కోరుట్ల, జనతా న్యూస్: భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయవాది గొప్ప విద్యావేత్త భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని కోరుట్ల పట్టణంలోని 23వ వార్డులో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ చేసి వారి జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా స్థానిక ఆసుపత్రి,దేవాలయ ప్రాంగణంలో వారి జ్ఞాపకార్థం మొక్కలు నాటి వారు దేశానికి,పార్టీకి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బింగి వెంకటేష్, స్థానిక వార్డు ఇన్చార్జ్ చెట్పల్లి మమత,ఓం ప్రకాష్,పర్యావరణ పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ సుధవేణి మహేష్ గౌడ్,జిల్లా నాయకులు ఇందూరి తిరుమల వాసు, కస్తూరి లక్ష్మీనారాయణ, 22వ వార్డు మాజీ కౌన్సిలర్ మాడవేణి నరేష్ ,పట్టణ మాజీ అధ్యక్షులు చిరుమల్ల ధనుంజయ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్, పోతుగంటి శ్రీనివాస్ బెక్కం అశోక్,శ్యామ్,రమేష్,పంబాల అజయ్,వార్డు ప్రజలు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# 'సాహెూ' శ్రద్ధా నెమలి సొగసు

బాలీవుడ్ టు టాలీవుడ్ శ్రద్ధా కపూర్ కి ఉన్న ఫాలోయింగ్ గురించి చెప్పాల్సిన పని లేదు. ఇంతకుముందు ప్రభాస్ సరసన %-%సాహెూ%-% చిత్రంలో నటించింది ఈ బ్యూటీ. శ్రద్ధా అందచందాలు, ప్రతిభకు అభిమానిగా మారిన ప్రభాస్ తన డ్రీమ్ గాళ్ కి పిలిచి మరీ అవకాశం కల్పించాడని కథనాలొచ్చాయి. అదంతా అటుంచితే, శ్రద్ధా ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా సరికొత్త ఫోటోషూట్లతో హృదయాలను కొల్లగొడుతూనే ఉంది. ఈ బ్యూటీ పాపులర్ మ్యాగజైన్ కవర్ పేజీలపైనా నిరంతరం దర్శనమిస్తోంది. తాజాగా ప్రఖ్యాత ది పీకాక్ మ్యాగజైన్ కవర్ పేజీపై అందంగా ముస్తాబై కనిపించింది. శ్రద్ధా పూర్తిగా ట్రెడిషనల్ అవతార్ లో ఆకర్షించింది. ఒక అందమైన లెహంగా, దానికి కాంబినేషన్ ఆభరణాలతో ఎంతో ముచ్చటగా కనిపిస్తోంది శ్రద్ధా. ముఖ్యంగా ఈ డిజైనర్ డ్రెస్ రూపకల్పన కోసం భారీ ఎంబ్రాయిడరీ వర్క్ చేసారని కూడా అర్థమవుతోంది. పాల రాతి అందాలతో తాజ్ మహల్ లా మెరిసిపోతున్న భారీ భవంతిలో ఈ అందమైన ఫోటోషూట్ ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. తాజా ఫోటోషూట్ కి అభిమానుల నుంచి అద్భుత స్పందన వస్తోంది. శ్రద్ధా కపూర్ ఈ గెటప్ లో నెమలిని తలపిస్తోందని అభిమానులు కీర్తిస్తున్నారు.




# రష్మిక ది రెబల్

ప్రతిభను ఎవరూ ఆపలేరు.. ప్రతిభావంతుల ఎదుగుదలకు ఎదురేలేదు. ఈ కోవకే చెందుతుంది రష్మిక మందన్న. కన్నడ సినిమాలో చిన్నగా మొదలై టాలీవుడ్ లో అగ్ర నాయికగా ఎదిగి, ఇప్పుడు బాలీవుడ్ లో లక్కీ ఛామ్ గా ఏల్తోంది. వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ సక్సెస్ ని కేరాఫ్ గా మార్చుకున్న ఈ బ్యూటీ ఏం చేసినా అది ట్రెండ్ గా మారుతోంది. ఇప్పుడు రష్మిక మందన్న కొత్త లుక్ సంథింగ్ స్పెషల్ గా వెబ్ లో దూసుకెళుతోంది. లెదర్ సోఫా.. పచ్చ-నలుపు రంగు ఫుల్ స్లీవ్స్ టీషర్ట్, దానిపై స్టైలిష్ కోట్, లేస్ ముడి వేయని వైట్ షూస్ ని ధరించి రియల్ రెబల్ ని తలపిస్తోంది. అందంలోనే కాదు ఫ్యాషన్ సెన్స్ లోను తనను కొట్టేవాళ్లే లేరని రష్మిక నిరూపిస్తోంది. బాలీవుడ్ టు టాలీవుడ్ నటవారసులు ఎందరు ఉన్నా వీళ్లెవరూ తన ముందు నిలబడలేరు! అని సవాల్ విసురుతోంది. బాలీవుడ్ లో జాన్వీకపూర్, ఖుషి కపూర్, సుహానా ఖాన్, అనన్య పాండే, సారా అలీఖాన్ .. ఇలా చాలా మంది నటవారసురాళ్లు ఉన్నారు. కానీ వీళ్లలో ఎవరికీ లేని స్టార్ డమ్ రష్మిక మందన్నకు ఉంది. అందానికి అందం, అభినయం, సక్సెస్, అదృష్టం అన్ని కోణాల్లో రష్మికకు ఎదురే లేదు. ఇప్పుడు ఫ్యాషన్ సెన్స్ లోను వీళ్లెవరూ తన ముందు దిగదుడుపేనని నిరూపించే పనిలో ఉంది. రష్మిక ఇటీవల కుబేర చిత్రంలో నటించింది. తదుపరి థామ, ది గర్ల్ ఫ్రెండ్ అనే చిత్రాల్లో నటించింది. ఇవన్నీ విడుదలకు రావాల్సి ఉంది.

# చీరలో సంయుక్తా ట్రెడిషనల్ టచ్‌తో గ్లామర్ ట్రీట్

టాలీవుడ్‌లో తనదైన నటనతో గుర్తింపు పొందిన సంయుక్తా, ఇప్పుడు తన గ్లామర్ ఫోటోషూట్లతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ చీర లుక్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బ్లష్ పింక్ కలర్ ఎంబ్రాయిడరీ చీరలో మెరిసిపోతూ, ట్రెడిషనల్ జ్యువెలరీ, గజ్రాతో ఆమె లుక్‌కు ఫ్యాషన్ ప్రపంచం పాజిటివ్ గా రెస్పాండ్ అవుతోంది. ఈ ఫోటోషూట్‌లో ఆమె ధరించిన చీర, బ్లౌజ్ డిజైన్, మేకప్ నుంచి హెయిర్ స్టైలింగ్ వరకు ప్రతీదీ మినిమలిస్టిక్‌గా ఉండేలా స్టైలింగ్ టీమ్ ప్లాన్ చేసింది. నాజూకు హావభావాలతో రిఫైన్‌డ్ మేకప్, మాయ చూపే చూపులతో సంయుక్తా ఎక్స్‌ప్రెషన్స్ మనసుల్లో చెరగని ముద్ర వేసింది. సాధారణ చీరను కూడా ఓ కళాఖండంగా మార్చగలిగే టాలెంట్ ఆమె సొంతమని ఈ ఫోటోలు మరోసారి నిరూపించాయి. అంతేకాదు, సంయుక్తా కెరీర్ పరంగా కూడా ఇప్పుడు సూపర్ పేస్‌లో ఉంది. నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ స్వయంభులో ఆమె హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం భారీ అంచనాలతో తెరకెక్కుతోంది. ఇందులో ఆమె పాత్రలో గ్లామర్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్. ఈ సినిమాతో పాటు మలయాళ స్టార్ మోహన్ లాల్, హీరో రామ్‌తో కూడా ఓ భారీ సినిమాలో నటిస్తోంది.



EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com